# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
గురువారం
18.12.2025

సంపుటి : 16 సంచిక: 83
పేజీలు: 6 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


## లక్నోలో కమ్ముకున్న పొగమంచు..

పొట్టి సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో కొనసాగుతున్న భారత జట్టు సిరీస్ పట్టేసేందుకు సిద్ధమైంది. ధర్మశాలలో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించిన టీమిండియా లక్నో ఏక్‌నా స్టేడియంలోనూ విజయంపై కన్నేసింది. అయితే.. షెడ్యూల్ ప్రకారం 6:00 గంటలకు వేయాల్సిన టాస్‌కు పొగమంచు అడ్డుపడింది. ఏక్‌నా స్టేడియంలో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో.. టాస్ ఆలస్యంగా వేయనున్నారు. 6:50 గంటలకు పిచ్‌ను పరిశీలించాక టాస్ పడనుంది. ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్ పాదం గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేదు. దాంతో మూడు మ్యాచ్‌లుగా బెంచ్‌కే పరిమితమైన సంజూ శాంసన్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. అనారోగ్యంతో చివరి రెండమ్యాచ్‌లకు దూరమైన అక్షర్ పటేల్ స్థానంలో ఎంపికైన షాబాద్ అహ్మద్ ఆడుతాడా? అనేది తెలియాల్సి ఉంది




## ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం విడతల్లో 1521 పంచాయతీలకు ఎన్నికలు



**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయా జిల్లాల కలెక్టర్లు**

**చట్టం, సిద్దిపేట:**

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సర్పంచు ఎన్నికలు ముగిశాయి. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11న, రెండో విడత 14న, మూడో విడత 17న జరిగాయి. మొదటి విడతలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 459, రెండో విడతలో 543, మూడవ విడతలో 519గ్రామ పంచాయతీలకు కలిపి మొత్తంగా 1521గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అక్కడక్కడ చెల్లాచెదురు ఘటనలు మినహా మూడు దశల పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. ఓ వైపు పోలీస్ అధికారులు, మరోవైపు జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవల్సిన ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల మూడు దశల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసినట్లు చెప్పడంలో ఎలంటి సందేహం లేదు. మూడు దశల్లోనూ పోలింగ్ ఉదయం 7గంటలకు కట్టుదిట్టమైన భద్రతా, పరిపాలన ఏర్పాట్ల నడుమ ప్రారంభమైంది. 6గంటలకే మాక్ పోలింగ్ మొదలైంది. తర్వాత 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరిగింది. గ్రామపంచాయతీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ అమర్చి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. చలి తీవ్రతను లెక్క చేయకుండా పలు ప్రాంతాలలో ఓటర్లు మ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలొచ్చారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఇదిలా ఉంటే, ఓటేసేందుకు బతుకుదెరువు కొరకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారందరూ పోలింగ్‌కు ఒక రోజే ముందు వారి వారి స్వస్థలాలకు చేరుకోగా, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ఉన్న వారు మాత్రం పోలింగ్ ప్రారంభ సమయంతో పాటు పోలింగ్ ముగిసే ఒంటి గంట వరకు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు సైతం ఓటు హక్కును వినియోగించుకోవడానికి మొగ్గు చూపారు.

# ఇది సరికాదు సార్

## మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వంపై మండిపడ్డారు

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టారు
- కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు
- రాజ్యాంగాన్ని కాలరాయడమేనని ప్రకటించారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు
- స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు
- రాజ్యాంగ హత్య, ప్రజాస్వామ్య హత్య అని అభివర్ణించారు

**ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యాంగం స్పష్టంగా చెప్పిన పార్టీ ఫిరాయింపు నియమాలను పూర్తిగా పక్కనపెట్టి స్పీకర్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగాన్ని కాలరాయడమేనని ప్రకటించారు. బహిరంగంగా పార్టీ ఫిరాయించినా ఆధారాలేవు అని చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.**







**చట్టం, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు నిస్సిగ్గుగా పట్టపగలు కాంగ్రెస్ పార్టీలో చేరినా కూడా సరైన ఆధారాలు లేవని తెలంగాణ స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడంపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. రాహుల్ గాంధీ “సేవ్ ది కానిస్టిట్యూషన్” నినాదం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పుతో నేడు పూర్తిగా బహిర్గతమైందని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థలను కూడా దిగజార్చడం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని ప్రకటించారు. ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని హరీశ్ రావు విమర్శించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీడిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగాన్ని కాలరాయడమేనని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. 'ఢిల్లీలో రాజ్యాంగ నైతికతపై గొప్ప ఉపన్యాసాలు ఇస్తూ.. తెలంగాణలో మాత్రం అదే రాజ్యాంగాన్ని నిర్లజ్జగా ధిక్కరించడం కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నిజస్వరూపం' అని కౌంటర్ ఇచ్చారు. 'సేవ్ ది కానిస్టిట్యూషన్ నినాదం మాటలకే పరిమితమై, ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారు. ఇది ఎంతో సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు.

స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని మాజీ ఎంపీ బోయనపల్లి వినోద్ కుమార్ ప్రకటించారు. స్వయంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పినా.. స్పీకర్ మాత్రం పార్టీ మారలేదని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని.. పార్లమెంట్‌లో వెంటనే పార్టీ పిరాయింపుల పై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

'స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు సోనియా గాంధీ భర్త రాజీవ్ గాంధీ తెచ్చిన చట్టం పనికిమాలిన చట్టంగా తేల్చారు. రాజీవ్ గాంధీ తెచ్చిన పార్టీ పిరాయింపుల చట్టం 10వ షెడ్యూల్‌ను పనికిమాలిన చట్టంగా స్పీకర్, ఇదే కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు చెప్పింది' అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ తెలిపారు. పార్టీ పిరాయించవచ్చు.. స్పీకర్ దగ్గర పార్టీ ఫిరాయించలేదని చెప్తే సరిపోతుందని ఇవాళ స్పీకర్ ప్రసాద్ తీర్పు ఇచ్చారని వెల్లడించారు. 'పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని స్పీకర్ నీరుగార్చారు. పార్టీ ఫిరాయింపుల చట్టం పనికిమాలిన చట్టం కాంగ్రెస్ పార్టీ చెప్పింది. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ చంపేసింది' అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణలో పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారంపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, ఇది ముమ్మాటికీ "రాజ్యాంగ హత్య, ప్రజాస్వామ్య హత్య" అని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగాన్ని కాపాడుతామని నిరంతరం ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ పార్టీ, చివరకు రాజ్యాంగబద్ధమైన స్పీకర్ వ్యవస్థను కూడా ప్రభావితం చేసి తప్పుడు నిర్ణయం వచ్చేలా చేసిందని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అయినప్పటికీ, ఈరోజు అదే పార్టీ ఆ చట్టానికి కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తోందని రాంచందర్ రావు మండిపడ్డారు. చేతుల్లో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని దేశమంతా పర్యటిస్తున్న రాహుల్ గాంధీ లాంటి నాయకులే, రాజ్యాంగ విలువలపై దాడి చేస్తున్నారని విమర్శించారు. స్పీకర్ పదవి అనేది స్వతంత్రంగా, పక్షపాతం లేకుండా పనిచేయాల్సిన అత్యున్నత పదవి అని, కానీ ప్రస్తుత నిర్ణయం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు.

## అనాధ బాలల నైపుణ్యాభివృద్ధికి సహకారం



**ఎం ఎన్ జె ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు ఎం ఈ ఐ ఎల్ డైరెక్టర్ సుధారెడ్డి**



**చట్టం, హైదరాబాద్:**

అనాధ బాలల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు, ఎం ఎన్ జె కాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్ ) డైరెక్టర్ సుధా రెడ్డి అన్నారు. తమ సంస్థ పది సంవత్సరాల నుంచి యువతలో నైపుణ్యాలను పెంచి వారు సొంత కాళ్లపై నిలబడేలా శిక్షణనిస్తున్నదని, అనాధ బాలలు కూడా అలా తమ కాళ్లపై తాము నిలబడేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ బ్లాక్ ను ఎలా అయితే అభివృద్ధి చేసామో అలానే ఎం ఎన్ జె క్యాన్సర్ ఆసుపత్రిని కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. ముందుగా ఇక్కడి వైద్యులతో మాట్లాడి ఏమి అవసరమో తెలుసుకుని ఆ అవసరాలను తీరుస్తామన్నారు. ఈ మేరకు ఎం ఈ ఐ ఎల్, ఎస్ ఆర్ ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో అనాధలకు చలి నుంచి రక్షణ పొందేందుకు ఉన్ని బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఎమ్ ఎన్ జె కాన్సర్ ఆసుపత్రిలో చిన్న పిల్లలకు బ్లాంకెట్స్, పండ్లు, మూసాపేటలోని సాయి సేవా సంఘ్ లో విద్యను అభ్యసించే వారికి బ్లాంకెట్స్ ను సుధా రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో సుధా రెడ్డి మాట్లాడారు. నగరంలోని సాయి సేవా సంఘ్ విద్యా మందిర్ లో ఆనాధలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు విద్యనభ్యసిస్తున్నారు. వారు పదో తరగతి లేదా ఆ పై చదువుల తరువాత తమ కాళ్లపై తాము నిలబడి స్వశక్తితో జీవించేందుకు తమ సంస్థ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఈ సంస్థ కొన్ని వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తోందని, వాటికి అదనంగా తమ సంస్థ తరపున అదనపు కోర్సులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలతో గడపడం వల్ల వచ్చే సంతోషం వేరే కార్యక్రమాల వల్ల తనకు రాదన్నారు. అందుకే తాను చిన్న పిల్లల కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. తనకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తి అని అన్నారు. తానూ చిన్నగా ఉన్నపుడు కొన్ని అంశాలను ఆమె ద్వారా స్ఫూర్తిగా తీసుకుని నిర్ణయాలు తీసుకున్నానని అన్నారు. చిన్నపుడు తీసుకునే సరైన నిర్ణయాలు అందరి జీవితాలను ఒక మలుపు తిప్పుతాయని, అందువల్లే ప్రతి ఒక్కరు చిన్న వయస్సులో సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు చలికాలంలో ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందుల నుంచి బయట పడేసేందుకు తమ ఫౌండేషన్ల తరపున సాయం చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణాలో ఈ కార్యక్రమం ప్రారంభమైందని, దీన్ని విస్తరిస్తామని తెలిపారు. చలికాలంలో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. ఎం ఎన్ జె క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను ముద్దాడిన సుధా రెడ్డి వారికి బ్లాంకెట్స్, పండ్లు పంపిణీ చేశారు.

### గాంధీ, నెహ్రూ, రాహుల్ కుటుంబ చరిత్ర చెప్పేందుకు

## సంగారెడ్డిలో లక్ష మందితో సభ

- **మోదీకి ప్రజల పరిపాలన చేయమని అధికారమిచ్చారా? గాంధీ, నెహ్రూ కుటుంబ చరిత్ర లేకుండా చేయాలని**
- **అధికారమిచ్చారా? మోదీ, షాపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్**




**చట్టం, హైదరాబాద్ :**

దేశం కోసం త్యాగాలు చేసిన మహాత్మాగాంధీ, నెహ్రూలను బీజేపీ నేతలు నరేంద్రమోదీ, అమిత్ షా టార్గెట్‌గా చేస్తూ మాట్లాడటం పట్ల సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. రాజకీయాలలో గాంధీ, నెహ్రూ పేర్లు వినపడకుండా చేయాలని మోదీ అమిత్ షా కుట్రలు చేస్తున్నారనీ, మహాత్మా గాంధీ, నెహ్రూ, రాహుల్ గాంధీ కుటుంబ చరిత్ర చెప్పేందుకు త్వరలో సంగారెడ్డి నియోజక వర్గంలో లక్ష మంది ప్రజలతో సభను ఏర్పాటు చేయనున్నట్లు జగ్గారెడ్డి ప్రకటించారు. జగ్గారెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ..మహాత్మా గాంధీ, నెహ్రూ, రాహుల్ గాంధీ కుటుంబం చరిత్ర లేకుండా చేయండి అని మోదీకి అధికారం ఇచ్చారా..? ప్రజల పరిపాలన చేయమని అధికారం ఇచ్చారా..?అని సూటిగా అడిగారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్పుపైనా జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. ప్రజలకు మేలు చేస్తారని బీజేపీకి ప్రజలు మూడుసార్లు పట్టం కడితే నరేంద్ర మోదీ, అమిత్ షా మాత్రం గాంధీ, నెహ్రూలను టార్గెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూ మీకులా క్రిమినల్స్ కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 1930లోనే గాంధీ 'రఘుపతి రాఘవ రాజారామ్ పతిత పావన సీతారామ్'అని సత్యాగ్రహం మొదలు పెట్టారని అన్నారు. ఆయన రాముడి గురించి చెప్పిన రోజు మోడీ, అమిత్ షాలు పుట్టలేదని అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు ఎక్కడ ఉన్నాయని నిలదీశారు. గాంధీ, నెహ్రూల పేర్లు లేకుండా చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం రైతులు, యువతను పట్టించుకోవడం లేదని, అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చించే పరిస్థితే లేదని, మోదీ పాలనలో ప్రజల అవసరాలు, రైతులు, మహిళా, యువత ఉద్యోగాలపై చర్చ జరగడం లేదన్నారు. స్వాతంత్రం కోసం ఆస్తి, ప్రాణాలు దారాదత్తం చేసిన నెహ్రూను టార్గెట్ చేసి బీజేపీ పని చేస్తుందన్నారు. వందే మాతరంపై చర్చలో ప్రియాంక గాంధీ ధీటుగా సమాధానం చెప్పారు.

## గ్రామాలలో కుక్కల స్వైరవిహారం

### ఆదేశాలు కాదు,చర్యలు కావాలి



**చట్టం, ధర్మసాగర్:**

మండలంలోని పలు గ్రామాలలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రక్షణగా నిలవాల్సిన గ్రామ సింహాలు ప్రజలపైనే దాడులకు తెగబడుతుండడం పట్ల ప్రజలలో ఆందోళన వ్యక్తం అవుతుంది. ప్రతి గ్రామంలో శునకాల స్వైర విహారంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నపిల్లల నుంచి పెంపుడు పశువులపై దాడి గ్రామాల్లో కుక్కల బెడద కారణంగా కాలు బయట పెట్టాలంటేనే ప్రజలు భయం భయంగా వెనకడుగు వేస్తున్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో గ్రామాలలో ప్రతిరోజు ఏదో ఒకచోట కుక్కల దాడిలో ఎవరో ఒకరు గాయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న పెద్దా అని తేడా లేకుండా ప్రతి ఒక్కరిపై కుక్కలు దాడులకు దిగుతున్నాయి.చివరికి మూగజీవాలైన పశువులు, గొర్రెలు, మేకలను కూడా వదలడం లేదు.కుక్కల స్వైర విహారంతో పిల్లలను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేసే పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూసి ప్రజలు వణికిపోతున్నారు.

**రేబీస్ కేసులు పెరుగుతున్నా అప్రమత్తం కాని అధికార వ్యవస్థ..**

కుక్కల దాడుల్లో నిత్యం ఎంతోమంది గాయపడుతున్నప్పటికీ దాడుల నియంత్రణ చర్యలు మాత్రం కనిపించడం లేదు. కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వారి బాధలు వర్ణనాతీతం గా మారుతున్నాయి. ఇటీవల రేబీస్ వ్యాధి కూడా సోకుతున్నట్లు పలుచోట్ల జరుగుతున్నాయి.ప్రభుత్వం కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసుకున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా గ్రామాల్లో కుక్కల బెడద ను నియంత్రించేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న సైనికుడు



**చట్టం పెద్దపల్లి:** మహారాష్ట్రలోని నాగపూర్ ఆర్మీ లో పనిచేస్తున్న శ్రీనివాస్ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నాగపూర్ నుండి వచ్చి తన స్వగ్రామం సుల్తానాబాద్ మండలం సుద్దాలలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలలో తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు .ఓటు విలువ ఎంత ముఖ్యమో తెలియజేశాడు.

## జహీరాబాద్ కొత్త కమీషనర్ గా సత్య ప్రణవ్

**బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్**



**చట్టం న్యూస్ జహీరాబాద్:** పట్టణ మున్సిపల్ కమిషనర్ గా బుధవారం రోజున కే.సత్య ప్రణవ్ నూతనంగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. అనంతరం కమీషనర్ కు మున్సిపల్ అధికారులు, మరియు సిబ్బంది వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానపు శుభాకాంక్షలు తెలిపి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. అదేవిధంగా వివిధ కుల ఆయా రాజకీయ, ప్రజా సంఘాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆయనను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలు కప్పి ఆహ్వానపు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ, తమ జహీరాబాద్ కమిషనర్ గా రావడం ఎంతో శుభసూచకంగా ఉందని, తమ వద్దకు మున్సిపల్ పట్టణ పరిధిలోని ఉన్నటువంటి ప్రజలందరూ మరియు ఆయా బస్తీల, వార్డులల్లో నెలకొని ఉన్నటువంటి ఆయా సమస్యలు తమ దృష్టికి వచ్చినచో వాటిని పరిష్కార మయ్యేలా చూసే విధంగా అడుగులు వేస్తామని, అంతేకాకుండా పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అదేవిధంగా ఎటువంటి సమస్యలు ప్రబలకుండా చూస్తామని మున్సిపల్ ప్రజల శ్రేయస్సే తమకు ముఖ్యంమని కమీషనర్ అన్నారు..

## నూతన కమిషనర్‌ను కలిసిన నాయకులు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ గా కొత్తగా వచ్చిన పూజారి శ్రావణి, ని బుధవారం రోజు కలిసిన ఆర్మూర్ డివిజన్ దళిత హక్కుల పోరాట సమితి నాయకులు, మాదరి నరేష్, వెన్న రమేష్, పుష్ప గుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు.

## హాకీ క్రీడాకారుల ఎంపిక



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జావేద్ భాయ్ మినీ స్టేడియంలో SGFI U/19 బాలికల నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల హాకీ సెలక్షన్స్ నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 20వ తేదీన రంగారెడ్డి జిల్లాలోని, సరూర్నగర్ లో జరగబోయే రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల పోటీలకు పాల్గొంటుందని నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్స్ చిన్నయ్య, అంజు, కాంగ్రెస్ నాయకులు కొంత పూర్ణ, సీనియర్ హాకీ క్రీడాకారులు కత్తి శీను, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఓటు వేసిన ఎమ్మెల్యే



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంకాపూర్ గ్రామంలో బుధవారం రోజు ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తన స్వగ్రామంలో సతీమణి, కూతురు తో కలిసి ఓటు హక్కును వినియోగించు కన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఓడిన వారు అధైర్య పడవద్దన్నారు. గెలుపు ఓటములు సహజం. నేడు ఓడిన వారు రేపటి గెలుపుకు నాంది అన్నారు.

## ట్రాక్టర్ తో హింసకు పాల్పడిన వ్యక్తులుపై కమిషన్కు ఫిర్యాదు

- వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్చార్సీలో ఫిర్యాదు
- డాక్టర్ పైడి ఎల్లారెడ్డి కమిషన్ కు ఫిర్యాదు




**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;**కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి మండలం, సోమార్పేట్ గ్రామంలో ట్రాక్టర్ తో హింసకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ లో పిటిషన్ దాఖలైంది. ఈ నెల 15 న సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులపై ట్రాక్టర్ ఎక్కించా రని అదే గ్రామానికి చెందిన డాక్టర్ పైడి ఎల్లారెడ్డి కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన రాజు అనే వ్యక్తి నివాసం వద్ద ఉద్దేశ పూర్వకంగా, సర్పంచ్ గా గెలిచిన కురుమ పాపయ్య సోదరుడు చిరంజీవి ట్రాక్టర్ తో ప్రజలను ఢీ కొట్టారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ ఘటనలో మహిళలు పిల్లలతో సహా ఆరుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారని వారిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిడితో పోలీసులు నిందితులను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కమిషన్ ఈ విషయంలో జోక్యం చేసుకొని స్థానిక పోలీసులను తక్షణ దర్యాప్తు కోసం అదేశించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ను డాక్టర్ పైడి ఎల్లారెడ్డి కోరారు.ఈ ఘటనపై నాంపల్లి లోని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

## బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో డాక్టర్ బాలు



(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు కు ప్రతిష్టాత్మకమైన ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 202324,202425 సంవత్సరాలలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి ఐదు వేల యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకు గాను ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కిందని తెలియజేశారు.భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ గుర్తింపు రావడం జరిగిందని దీనికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలను తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహిస్తామని అన్నారు.

## 163 బీఎన్ఎస్ఎస్ ఉల్లంఘనలపై 30 మందిపై కేసులు నమోదు : ఎస్ఐ ఎస్ శ్రీ సాయి

**చట్టం, బోథ్ :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బోథ్ మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉన్నప్పటికీ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు బోథ్ ఎస్ఐ ఎస్ శ్రీ సాయి తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 100 నుంచి 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉండగా, వాటిని పట్టించుకోకుండా గుమ్మిగూడగా చేరిన 30 మందిపై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడి పరిస్థితులు సృష్టించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని, రంగులు చల్లుకోవడం, టపాకాయలు వెలిగించడం వంటి చర్యలు చేపట్టకూడదని సూచించారు. అలాగే ఇతరులను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని, నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని బోథ్ ఎస్ఐ స్పష్టం చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన సర్పంచ్ ఎన్నికలు

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్**

**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతలలోనూ ఎన్నికలు సజావుగా కొనసాగాయని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మూడవ విడత పోలింగ్ బుధవారం ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యిందన్నారు. చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. ఉదయం 9.00 గంటల సమయానికి సగటున 23.35 శాతం పోలింగ్ నమోదయ్యింది. 11 గంటల సమయానికి 54.69 శాతం ఓటింగ్ పూర్తయ్యిందని అధికారులు ప్రకటించారు. కాగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బాల్కొండ, అంకాపూర్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లు, మెడికల్ క్యాంపు, ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అని తనిఖీ చేశారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఆర్మూర్, బాల్కొండ, భీమ్గల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడవ విడతలో మొత్తం 165 సర్పంచ్ స్థానాలకు గాను, నామినేషన్ల ఉపసంహరణ నాటికే 19 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో మిగిలిన 146 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా మొత్తం 1620 వార్డు స్థానాలకు గాను 490 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిని మినహాయిస్తూ, 1130 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1490 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎక్కడికక్కడ ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం, బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు ఐ.డీ కార్డు లేని పక్షంలో ఎన్నికల సంఘం ధృవీకరించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని విస్తృత ప్రచారం చేయడం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మూడు విడతలలోనూ పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయించామని, వెబ్ క్యాస్టింగ్ జరిపించామని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారని అన్నారు. కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరిగిందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగగా, నిర్ణీత సమయం లోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించామని అన్నారు. మధ్యాహ్నం 2.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. కాగా, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సైతం పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా సందర్శిస్తూ ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలన జరిపారు. భీంగల్, బడా భీంగల్, రామన్నపేట్, మోర్తాడ్, కమ్మర్పల్లి, అంకాపూర్, ముప్కాల్, బాల్కొండ తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి, అంకాపూర్ జెడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పరిధిలోని తమ సొంత గ్రామం బాచుపల్లిలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు పదవిని అలంకార ప్రాయంగా భావించకుండా ప్రజాసేవే పరమావధిగా సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా, సమగ్ర గ్రామీణ అభివృద్ధిపై పంచాయతి పాలక వర్గం దృష్టి పెట్టి స్వయం సమృద్ధికి కృషి చేయాలని అలాగే నేటి సమాజంలో యవత ఆలోచనలు బాగా కలుషితమయ్యాయని, వాటి నుంచి బయటపడడానికి ఆధ్యాత్మిక శిక్షణ, అత్యవసరమని వాటి కోసం కృషిచేయాలని సమృద్ధి గ్రామంగా మారాలంటే ఆర్థిక, సామాజిక, రాజకీయ స్వాతంత్ర్యం సాధించడమే ప్రధాన లక్ష్యంగా. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కొరకు పాటుపడాలని గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ గ్రామ సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు.

## మల్లారం, మోస్రా సర్పంచులను అభినందించిన ఎమ్మెల్యే ధన్ పాల్


**గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతం చేసిన నాయకులకు ప్రశంస**





**చట్టం ఇందూరు:** భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో కృషి చేసి విజయం సాధించిన మల్లారం మరియు మోస్రా గ్రామ సర్పంచులను ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సన్మానించి అభినందించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన మల్లారం గ్రామ సర్పంచ్ అన్నం గోపి, మోస్రా గ్రామ సర్పంచ్ గుత్పే భూపాల్ రెడ్డిలను ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో బీజేపీని పటిష్టం చేయడంలో వీరి కృషి ఎంతో ముఖ్యమైనదని కొనియాడారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సర్పంచులు క్రియాశీలక పాత్ర పోషించాలని పార్టీ విజయం కోసం కృషి చేసిన వారిని సముచితంగా గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ధన్ పాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సోమార్పేట్ ట్రాక్టర్ దాడిపై అఖిలపక్ష అల్టిమేటమ్ 24 గంటల్లో చర్యలు లేకుంటే 19న ఎల్లారెడ్డి బంద్..!



**చట్టం/ ఎల్లారెడ్డి :** మండలంలోని సోమార్పేట్ గ్రామంలో చోటుచేసుకున్న విషాదకర ట్రాక్టర్ దాడి ఘటనపై అఖిలపక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులపై 24 గంటల్లోపు చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. ఎల్లారెడ్డి పట్టణంలోనీ శివాజీ చౌరస్తాలో బుధవారం అఖిలపక్ష నాయకులు, సోమార్పేట్ గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల అనంతరం ప్రత్యర్థి వర్గంపై దాడి చేయాలనే ఉద్దేశంతో కుర్మ పాపయ్య తమ్ముడు కురుమ చిరంజీవి ట్రాక్టర్ తో బిట్ల బాలరాజు కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారని అఖిలపక్షం ఆందోళన వ్యక్తం చేసింది. చిరంజీవిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినప్పటికీ, తమ ఫిర్యాదులో పేర్కొన్న కురుమ సాయిబాబా, పాపయ్యతో పాటు ఇతరులపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ట్రాక్టర్ దాడికి ప్రేరేపించిన వారిని కూడా హత్యాయత్నం కేసులతో బుక్ చేసి రిమాండ్‌కు తరలించాలి అని అఖిలపక్షం డిమాండ్ చేసింది. నిందితులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు మా పోరాటం కొనసాగుతుంది. స్పందన లేకుంటే ఈ నెల 19వ తేదీన శుక్రవారం ఎల్లారెడ్డి బంద్ తప్పదు అని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు జనార్దన్ రెడ్డి, ఆదిమూలం సతీష్, పెద్దెడ్ల నర్సింలు, చిరంజీవులు, పృథ్వీరాజ్, బర్కత్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన జిల్లా కలెక్టర్

- ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**చట్టం, నిజాంసాగర్ :** నిజాంసాగర్ మాగి గ్రామాల మధ్యలో జరిగిన ఆటో, బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మానవత్వంతో స్పందించి తన వాహనంలో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు వివిధ మండలాల్లో కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వెళ్తుండగా, మార్గమధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద కోడ్‌పగల్‌లో ఓటు వేసి తిరిగి వస్తున్న సమయంలో ఆటో, బైక్ ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. ప్రమాదాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తికి తక్షణ సహాయం అందించి, ఎలాంటి ఆలస్యం చేయకుండా తన వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు.

## పోలింగ్ కేంద్రాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్



**చట్టం రామగుండం కమీషనరేట్:** మూడవ విడత పంచాయతీ ఎన్నికలు ప్రారంభమైన నేపథ్యంలో, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీసులు అమలు చేస్తున్న నిఘా చర్యలు, ఓటర్ల రాకపోకల పరిస్థితిపై వివరంగా సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట అదనపు బందోబస్తు, మోహరింపు చేయాలనీ సూచించారు. ప్రజలు నిర్భయంగా, శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అడ్మిన్ డీసీపీ వెంట చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, బెల్లంపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ పెద్దన్న, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి

- పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళి, భద్రత ఏర్పాట్లు పరిశీలించిన పెద్దపల్లి డీసీపీ




**చట్టం రామగుండం కమీషనరేట్:** రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్, ఓదెల, సుల్తానాబాద్, పెద్దపల్లి, ఎలిగేడు మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు. పోత్కపల్లి, మడక. ఓదెల, కొలనూరులలో ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు చేశారు. మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పోత్కపల్లి ఎస్ ఐ దీకొండ రమేష్, తదితరులు ఉన్నారు.

## గోవింద్ పేట్ సర్పంచ్ గా అప్పల గణేష్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ గ్రామ సర్పంచ్ గా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి అప్పల గణేష్, 1100వందల ఓట్ల మెజార్టీ తో విజయం సాధించారు. గ్రామానికి సేవా చేసే అవకాశం ఇచ్చిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు. గ్రామభివృద్ధిలో గ్రామాన్ని ఆదర్శంగా ఉంచడానికి గ్రామ ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్తానన్నారు. అత్యధిక మెజార్టీ ఇచ్చి గెల్పించిన గ్రామ ప్రజలందరకి నాయొక్క కృతజ్ఞతలు తెలియ చేస్తున్న అని అయన అన్నారు. గ్రామ ప్రజలందరికి ఏ సమస్య వచ్చిన ముందుండి పరిష్కరిస్తానని గ్రామంలోని సమస్యలు ప్రజల సహకారంతో తీరుస్తా గ్రామ అభివృద్ధి కి అహర్నిశలు కృషి చేస్తా అని తెలిపారు.

## భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య



**చట్టం రామగుండం కమీషనరేట్:** భార్య కాపురానికి రావడం లేదని స్థానిక విజయ్ నగర్ కు చెందిన ఆవుల రమేష్(50) ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. వివరాలలోకి వెళితే...ఎల్ బి నగర్ కు చెందిన ఆవుల లక్ష్మి కి ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉండగా ఆమె పెద్ద కుమారుడైన ఆవుల రమేష్ తో ఉంటుంది.అయితే రమేష్ కు ఆమె భార్యతో గత కొంత కాలంగా విభేదాలు ఉండటం తో ఆమె వేరుగా ఉంటుంది. భార్య దూరంగా ఉండటం తో మద్యానికి బానిసై, మనస్తాపానికి గురైన ఆవుల రమేష్ ఇంట్లో ఎవరూ లేని సమయం లో వంటగది లో లుంగీతో ఫ్యాన్ కు ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి లక్ష్మి పిర్యాదు మేరకు వన్ టౌన్ ఏ ఎస్ ఐ వెంకటేశ్వర బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
గురువారం
18.12.2025


# ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం విజయోత్సవ ర్యాలీలు నిషేధం మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

- ప్రశాంత వాతావరణంలో మూడో విడత పోలింగ్
- పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలించన డీసీపీ




**చట్టం రామగుండం కమీషనరేట్:** రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జిల్లా జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, మందమర్రి మండలాల లోని పలు పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన మంచిర్యాల జోన్ డీసీపీ ఏ. భాస్కర్. మూడవ విడత ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు జిల్లాలో భద్రతా చర్యలను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ బీమారం, ఇందారం, జైపూర్, చెన్నూర్, కోటపల్లి లలోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి పై బందోబస్త్ పై అప్రమత్తంగా ఉండాలని ఏలాంటి ఎలాంటి ఆలోచనయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతరం పోలీస్ అధికారులతో పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎటువంటి అంతరాయం లేకుండా శాంతి భద్రతలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పూర్తిగా అమల్లోనే కొనసాగుతుందని, మూడు దశల పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏ విధమైన విజయోత్సవాలు, ర్యాలీలు, బైక్ శోభాయాత్రలు, డీజే కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండడానికి ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ నాయకులు సహకారం అందించాలని డీసీపీ కోరారు.

# వృద్ధురాలి సమస్య చూసి వెంటనే స్పందించిన పోలీస్ కానిస్టేబుల్

- మానవత్వంతో వృద్ధురాలికి సాయం చేసిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ నితిన్



**చట్టం రామగుండం కమీషనరేట్:** రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సిర్సా గ్రామం పోలింగ్ లో నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలు తన ఓటు హక్కు వినియోగించుకోవడానికి కుటుంబ సభ్యుల సాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చారు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మానవత్వంతో ఆ వృద్ధురాలిని తన చేతులతో ఎత్తుకొని లోపలికి తీసుకెళ్లారు. వృద్ధురాలికి ఓటు వేసేలా సహకారం అందించి తన సేవాభావాన్ని, మానవత్వం చాటుకున్నారు. వృద్ధురాలి కి సహాయం చేయడానికి పోలీసుల చొరవను గ్రామస్థులు అభినందించారు.

# రాజీ మార్గమే రాజమార్గం

- కేసుల పరిష్కారానికి ప్రజలు ముందుకు రావాలి
- ఎస్ఐ శేఖర్ రెడ్డి




**చట్టం, శంకరపట్నం :** శంకరపట్నం మండల ప్రజలందరూ తమ మధ్య ఉన్న వివాదాలను, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి డిసెంబర్ 21న నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్ ఒక గొప్ప అవకాశమని శంకరపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్ఐ శేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కాంప్రమైజ్ (రాజీపడగల) మరియు కాంపౌండబుల్ కేసులను కక్షిదారులు పరస్పర అవగాహనతో ఇక్కడ పరిష్కరించుకోవచ్చు. లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకుంటే కోర్టు ఖర్చులు తగ్గడమే కాకుండా, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే సమయం ఆదా అవుతుంది. ఇక్కడ జరిగే ఒప్పందానికి చట్టపరమైన గుర్తింపు ఉంటుంది. దీనివల్ల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించి, ఇరుపక్షాల మధ్య సామరస్యం నెలకొంటుంది.రాజీ మార్గమే రాజమార్గం కోపం, కక్షలు, వివాదాలను పక్కనపెట్టి 'రాజీ మార్గమే రాజమార్గం' అనే భావనతో ప్రజలు ముందుకు రావాలి. శాంతియుత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మండల పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.


# రోడ్డు ప్రమాద బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- మాజీ సర్పంచ్ గట్టు తిరుపతి గౌడ్



**చట్టం శంకరపట్నం :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఇజ్జగిరి విజేందర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ గట్టు తిరుపతి గౌడ్ బుధవారం పరామర్శించారు. విజేందర్ అకాల మరణం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా తన వంతు సామాజిక బాధ్యతగా బాధిత కుటుంబానికి 5,000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌కు కుటుంబ సభ్యుల ఘన సత్కారం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన నేతూరి ప్రేమలత నర్సయ్య ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఘన విజయం సాధించారు. ఈ శుభ సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు సాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడింది. గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో నూతన సర్పంచ్ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందించాలని వారు ఆకాంక్షలు వ్యక్తం చేశారు. ఈ సత్కార కార్యక్రమంలో సిహెచ్ నవీన్ తండ్రాల లక్ష్యం రాజ్యం, రాధా ఝాన్సీ, బొజ్జోవా కొమ్ము లక్ష్మి తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బాలరాజుపల్లి గ్రామ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం కల్పించేలా ఆమె నాయకత్వం ప్రజలకు మేలు చేస్తుందని పాల్గొన్నవారు విశ్వాసం వ్యక్తం చేశారు.


# కస్తూర్బా పాఠశాలలో DLSA ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల అవసరాలపై తీవ్ర అసంతృప్తి



**చట్టం / ఎల్లారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం కామారెడ్డి జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యదర్శి టి. నాగరాణి ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్‌లోని వంటగది, స్నానపు గదులు, నిద్రించే చోట్లు పరిశీలించి తీవ్ర అసంతృప్తి చెందారు. ముఖ్యఅతిథిగా హాజరైన డి ఎల్ ఎస్ ఏ (డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ) కార్యదర్శి టి. నాగరాణి విద్యార్థుల అవసరాలు, హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించటం కోసం కార్యక్రమం నిర్వహించారు. పోక్సో చట్టం, బాలల హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, బాల్య వివాహాల విషయంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల న్యాయ సంస్థ అధికారిణి ఎం. సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ అరంగేట్రం చేసిన పాత్రికేయుడు



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్ పల్లె, హరిపూర్ గ్రామ సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన పాత్రికేయుడు నవనాథ పురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్దెం. చేపూర్ హరిపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్న గ్రామాన్ని హరిపూర్ సపరేట్ గ్రామ పంచాయతీ కొరకు పాటుపడ్డ వ్యక్తిగా, సపరేట్ గ్రామ పంచాయతీ సా వ్యక్తిగా, నిరంతరం ప్రజల కోసం పరితపించే మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా గ్రామ ప్రజలు ఆదరించి 70 ఓట్ల మెజారిటీతో గెలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు నాకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం పాటు పాడుతా పోరాడుతా అన్నారు. జిల్లాలోనే ఉత్తమ ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతా అన్నారు.

# ముదిరాజ్ ఉద్యమ శిల్పి కొర్వి కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం: డాక్టర్ బట్టు విఠల్ ముదిరాజ్



**చట్టం/ ఎల్లారెడ్డి :** ముదిరాజ్ ఉద్యమ శిల్పి కొర్వి కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం అని తెలంగాణ ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బట్టు విఠల్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణలో సామాజిక, రాజకీయ ఉద్యమాలకు మొదటి వెలుగు కిరణంగా నిలిచిన కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వంటి మహనీయులు ముదిరాజ్ సమాజానికి శాశ్వత స్ఫూర్తి అన్నారు. డిసెంబర్ 19న సికింద్రాబాద్‌లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో తొలి మేయర్, విద్యావేత్త, జర్నలిస్ట్, రచయిత, ఉద్యమకారుడు అయిన కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరుగనున్నట్లు తెలిపారు. 1922లోనే నిజాం రాజ్యంలో ముదిరాజ్ మహాసభను స్థాపించి జాతి చైతన్యానికి నాంది పలికిన దూరదృష్టి గల నాయకుడని బట్టు విఠల్ ముదిరాజ్ పేర్కొన్నారు. హైదరాబాద్ బలహీన వర్గాల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన కృష్ణస్వామి ముదిరాజ్ మహిళా అక్షరాస్యతకు ప్రాణం పోసి అనేక గ్రంథాలయాలను స్థాపించిన సంస్కర్తగా గుర్తింపుపొందారన్నారు. ఇద్దరిభుజాలపై రిక్షాలు లాగే కూలీల సమస్యను గుర్తించి... సైకిల్ రిక్షా విధానాన్ని ప్రవేశపెట్టిన తొలి పారిశ్రామికవేత్తగా నగర అభివృద్ధిలో కీలకంగా నిలిచారని తెలిపారు. జర్నలిజం రంగంలో డెక్కన్ స్టార్, మసావత్, న్యూ ఎరా వంటి పత్రికల సంపాదకుడిగా పనిచేసి, సియాసత్, రహ్నుమాఎ డెక్కన్ వంటి అనేక ఉర్దూ దినపత్రికలలో రచనలు చేస్తూ పత్రికా రంగంలో చిరస్మరణీయ ముద్ర వేశారు. 1925లో స్థాపించిన తన ప్రింటింగ్ ప్రెస్ ద్వారా పిక్టోరియల్ హైదరాబాద్, హైదరాబాద్ నగర నిర్మాణం చరిత్ర, గోవా స్వేచ్ఛా ఉద్యమంపై పుస్తకాలు రచించి విద్యా రంగానికి అపూర్వ సేవలందించారు. ముదిరాజ్ ముద్దుబిడ్డ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతిని ప్రతి మండల స్థాయిలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని డాక్టర్ విఠల్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడిని కలెక్టర్ వాహనంలో ఆస్పత్రికి తరలింపు

- మానవత్వం చాటుకున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ని వెంటనే వాహనంలో ఆస్పత్రికి తరలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తన మానవత్వం చాటుకున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ నిజాంసాగర్ మాగి మధ్యలో ఆటో, బైక్ డీ కొట్టిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ని మానవత్వంతో స్పందించి వాహనంలో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వివిధ మండలాల్లో కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వెళ్తుండగా, మార్గమధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద కోడ్పగల్లో ఓటు వేసి తిరిగి వస్తున్న సమయంలో ఆటో, బైక్ ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. ప్రమాదాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తికి తక్షణ సహాయం అందించి, ఎలాంటి ఆలస్యం చేయకుండా వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కలెక్టర్ తీరును పలువురు అభినందించారు.

# కార్మికుల ఆదాయం నాయకుల దానం

- సింగరేణి గని కార్మికుల కష్టార్జిత డబ్బులు ఫుట్బాల్ టోర్నమెంట్లకు ఖర్చు చేయడం ఏమిటి??
- గుర్తింపు సంఘాలు ఏఐటీయూసీ ఐఎన్టీయూసీ మర బొమ్మలా వ్యవహరిస్తున్నాయి!!!
- సీఎం ఫుట్బాల్ ఆడితే సింగరేణికి ఎందుకింత సంబరం



**చట్టం రామగుండం :** సింగరేణి యాజమాన్యం సింగరేణి సంస్థలు పనిచేస్తున్న గని కార్మికులు భూగర్భంలోకి దిగి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకోవడమే కాకుండా సింగరేణి సంస్థలు కాపాడుకోవడం కొరకు చేస్తున్న కృషిలో భాగంగా వస్తున్న కోట్లాది రూపాయల ఆదాయాన్ని సింగరేణి యాజమాన్యం ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి ఫుట్బాల్ టోర్నమెంట్ కు 10 కోట్ల రూపాయలు కేటాయించడంపై సర్వత్ర నిరసన వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గోశిక అశోక్ మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ద్వారా వస్తున్న డబ్బులను సింగరేణి గని కార్మికుల సంక్షేమం కోసం వారి పిల్లల సంక్షేమం కోసం కేటాయించాలి తప్ప ఎవరు క్రికెట్ ఆడుతున్నారు. ఎవరో ఫుట్బాల్ ఆడుతున్నారు ఎవరో ఇంకేదో ఆడుతున్నారు వారికి కోట్లాది రూపాయల కేటాయించాలని ఆలోచన సింగరేణి సంస్థకు ఎవరు ఇచ్చింద్రు అని ప్రశ్నిస్తూ, ఈ అగైత్యాన్ని కనీసం గుర్తింపు పొందిన యూనియన్లు ఏఐటీయూసీ గాని ఐఎన్టీయూసీ గాని వారికి మద్దతు పలుకుతున్న సిఐటియు గాని ఎందుకు దీనిపైన మాట్లాడడం లేదు అంటే, వీరు చూసి చూడనట్టు పోతే వీరికి యాజమాన్యం వచ్చే మామూలు యధావిధిగా చేరుతాయని ఆశతో కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయమై హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ... సింగరేణి యాజమాన్యం కార్మికుల ద్వారా వచ్చే లాభాలను ఆదాయాన్ని వారి సంక్షేమ కొరకే కేటాయించాలి.అలాగే సింగరేణి అనుబంధ పరిశ్రమల అభివృద్ధి కొరకు కేటాయించాలి కానీ ఎలాంటి సంబంధం లేని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్బాల్ టోర్నమెంట్లు పెట్టి ఆయన ఫుట్బాల్ ఆట ఆడతా ఉంటే చూసి స్పందించి 10 కోట్ల రూపాయలు ఆ ఫుట్బాల్ టోర్నమెంట్ ల కొరకు కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ఇది కార్మికుల లోకమంతా గమనిస్తుందని దీనిపై సరైన వివరణ కార్మికులకు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే సీఎం తన సొంత ఊరి కోసం సింగరేణి డబ్బులను కోట్ల రూపాయలు తీసుకువెళ్లి అభివృద్ధి పరుస్తుంటే ఈ గుర్తింపు సంఘాలు యూనియన్లకు కనీసం చీమకుట్టినట్టు లేకపోవడం సోచనీయమని ఎద్దేవా చేశారు. దీనికి అనుగుణంగా హెచ్ఎంఎస్ పూర్తిస్థాయిలో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉందని అశోక్ హెచ్చరించారు. ఒకవేళ ఆ ఫుట్బాల్ పోటీలు సింగరేణి సంస్థ కానీ సింగరేణి కార్మికుల పిల్లలకు కార్మిక కుటుంబాల గాని ఏమైనా సంక్షేమానికి గాని వారి అభివృద్ధి గాని దోహదపడుతుంది అంటే చేసినా పర్వాలేదు. కేవలం యాజమాన్యం ప్రభుత్వం ముందు సీఎం ముందు తన పేరు ప్రతిష్టలు కాపాడు కోసం ఇలా ఖర్చు చేయడం అపహాస్యంగా ఉందని గోశిక అశోక్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి ఈ పదికోట్ల రూపాయల ఖర్చుపై కార్మిక వర్గానికి తెలియపరచాలని ఇంత జరిగిన గుర్తింపు సంఘాల యూనియన్లు స్పందించకుండా యాజమాన్యం తొత్తులుగా మారి వారికి అచ్చే ఇనాములను తీసుకుంటూ ఇలా కార్మికులను మోసగించడం ఎంతవరకు కరెక్ట్ అని దీనికి కార్మిక వర్గం తీవ్రంగా పరిగణించాలని ఆయన కోరుతూ, ఈ కోట్లాది రూపాయల డబ్బులతో కొత్త భూగర్భములను ప్రారంభిస్తే కొన్ని వందల మందికి నిరుద్యోగులకు జీవనోపాధి కలుగుతుందని ఈ సంక్షేమం వారికి అవసరం లేదా అంటూ విమర్శించారు.

# రామకోటి రామరాజకు ముక్కోటి ఏకాదశి ఆహ్వానం

- గోటి తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాల కార్యక్రమం అమోఘం
- దుబ్బాక బాలాజీ దేవాలయం ప్రతినిధి చింత నాగేందర్



**చట్టం, సిద్దిపేట (దుబ్బాక):** రామ నామమే ప్రాణమని నమ్మి గత 30 సంవత్సరాల నుండి ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తు ప్రతి భక్తునిచే రామనామాన్ని లిఖింపజేపిస్తున్న సిద్ది పేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు కి బుధవారం నాడు దుబ్బాక బాలాజీ దేవాలయం ప్రతినిధి చింత నాగేందరు ముక్కోటి ఏకాదశి ప్రత్యేక ఆహ్వానం పత్రికను అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ భద్రాచల సీతారాముల కళ్యానానికి మా దుబ్బాక చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి ప్రతి సంవత్సరం గోటితో వడ్లను ఒలిపించి భద్రాచల కల్యానానికి అందించి మళ్ళీ మాకు తిరిగి ఉచితంగా ముత్యాల తలంబ్రాలు అందించడం అయన చేస్తున్న నిస్వార్థ భక్తి అమోఘం అని వారి సేవలను కొనియాడారు.

# టీజీవీపీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన తనిఖీ





**చట్టం, బోధన్ :** బుధవారం నాడు తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆధ్వర్యంలో బోధన్ మండలంలోని సంగం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీజీవీపీ బోధన్ డివిజన్ కార్యదర్శి మాదరోళ్ల నిఖిల్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నిర్భయంగా తెలియజేయాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు శివరాజ్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం రోజు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగ యొక్క ప్రాముఖ్యత, శాంతి, ప్రేమ, సోదర భావం వంటి విలువలను గుర్తుచేస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధించిన త్యాగం, మానవత్వం, సేవా భావాన్ని విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాల్సిన అవసరాన్ని ఈ వేడుకల ద్వారా తెలియజేశారు. విద్యార్థులు నిర్వహించిన క్రిస్మస్ గీతాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలు ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చంద్రిక, మాట్లాడుతూ విద్యార్థినిల్లో ఐక్యత మతసామరస్యం, సాంస్కృతిక విలువలను పెంపొందించాలని కోరుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మొర్రాయిపల్లె గ్రామ సర్పంచ్‌గా మెంగని శ్రీను ఘన విజయం




**చట్టం ముస్తాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మొర్రాయిపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో మెంగని శ్రీను ఘన విజయం సాధించారు. గ్రామ ప్రజలు విశ్వాసంతో తనను ఎన్నుకున్నందుకు ఆయనకు విస్తృతమైన మద్దతు లభించింది. ఈ సందర్భంగా మెంగని శ్రీను మాట్లాడుతూ, గ్రామ సర్పంచిగా గెలిపించి గ్రామానికి సేవ చేసే అవకాశం కల్పించిన ప్రతి గ్రామస్తుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ఎప్పుడూ అందుబాటులో ఉండి గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, త్రాగునీరు, రహదారులు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో మొర్రాయిపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామంలో సంబర వాతావరణం నెలకొనగా, అభిమానులు, గ్రామస్తులు విజేతను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ఎన్నికల సరళి తెలుసుకున్న వినయ్ రెడ్డి



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం, డొంకేశ్వర్ మండలం లలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల సరళి తెలుసుకున్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి. నందిపేట్, డొంకేశ్వర్ మండలంలోని కుద్వాన్పూర్ నందిపేట్, తొండకూరు, డొంకేకేశ్వర్, అన్నారం, కోమటిపల్లి, నికాల్పూర్, బాద్గుణ, ఉమ్మెడ, బజార్ కొత్తూరు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల సరళి, ఓటింగ్ సరళి తెలుసుకున్నారు. వారితో పాటు పాల్గొన్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.

# న్యాయవాదిని ఢీ కొట్టిన కారు...వెంటనే ఆసుపత్రికి తరలింపు



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది సతీష్, బుధవారం సాయంత్రం వ్యక్తిగత పనుల కోసం ద్విచక్ర వాహనంపై నాగిరెడ్డిపేట్ వైపుకు వెళ్తుండగా, ధర్మారెడ్డి గ్రామ శివారు వద్ద కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి ప్రత్యక్ష సాక్షి అయిన కారు వాహనదారుడు వెంటనే న్యాయవాదిని ఎల్లారెడ్డి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి పట్టణ బారాస అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ ఆసుపత్రికి చేరుకుని న్యాయవాది ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కొరకు హైదరాబాద్ కు తరలించినట్లు ఆయన తెలిపారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- మదనపల్లి కొత్త తండా ఉపసర్పంచ్ ని
- అభినందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





**చట్టం, శంషాబాద్ :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉప సర్పంచ్ గా ఎన్నికైన శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా ఉప సర్పంచ్ కోర్ర కళావతి శ్రీనివాస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్పంచ్, ఉప సర్పంచ్ ఆదర్శవంతంగా గ్రామాల్లో పాలన చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజల కోసం కష్టపడే మానవత్వాన్ని అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో అపజయం ఉండదని ఈ సందర్భంగా వారికి సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని భవిష్యత్తులో కూడా గ్రామపంచాయతీలకు సమృద్ధిగా నిధులు తెచ్చి పల్లెలను అభివృద్ధి పథకంలో నడపాలని తెలిపారు. గ్రామాలకి పరిమితమై ఎప్పటికప్పుడు అక్కడి సమస్యలు తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో కృషి ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవనాయక్, కోర్ర స్వరూప, కాళీ, రమేష్, భాస్కర్, కోర్ర నీల, బాబు తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తు ఏర్పాట్లు, పోలింగ్ సరళిని పరిశీలించిన పోలీస్ కమీషనర్



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పరిధిలోనీ నందిపేట్, బాల్కొండ, మోర్తాడ్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మూడవ విడుత ఎన్నికల నేపథ్యంలో బుధవారం రోజు మూడవ విడత ఎన్నికలలో భాగంగా నందిపేట్, బాల్కొండ, మోర్తాడ్, ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ పోలింగ్ కేంద్రంలలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పోలింగ్ కేంద్రంలను సందర్శించిన నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ. పి. ఎస్., ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను, భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, సిబ్బంది అధికారులు అప్రాతంగా ఉండాలని సూచించారు. ప్రజలు శాంతి యూత వాతావరణంలో తమ ఓటు హక్కును సధ్వినియోగం పర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు డి.సి.పి ఎ.ఆర్. రామచంద్రరావు, ఆర్మూర్ ఏసిపి జె. వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ శ్రీధర్ రెడ్డి, విజయ్ బాబు, ఎస్.ఐలు రాము, వెంకట్రావు, వినయ్, శైలేందర్, ఐ.కె.రెడ్డి, ఆర్వో అధికారులు చంద్రమోహన్, పండరి, సంతోష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## జల సంచయ్‌జల భాగీరథి కార్యక్రమం



**చట్టం రామగుండం :** జల సంచయ్‌జల భాగీరథి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న భూగర్భ జలాల సంరక్షణా చర్యలు విజయవంతం చేయడంలో వార్డు అధికారులు సహకరించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ అన్నారు. జల సంచయ్‌జల భాగీరథి కార్యక్రమం పై వార్డు అధికారులకు , సహాయకులకు అవగాహన కల్పించడానికి రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వర్షపు నీటి సంరక్షణా నిర్మాణాలు, ఇంకుడు గుంతలు ప్రతి ఇంట్లో ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే నగర పాలక సంస్థ ద్వారా ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతలు నిర్మించడానికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలని అన్నారు. బోర్ వెల్స్ వద్ద నీరు వృధాగా పోకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలని అన్నారు. మార్చి 31 , 2026 లోపు పది వేల ఇంకుడు గుంతలు మొదటగా నిర్మించిన నగర పాలక సంస్థకు రెండు కోట్ల రూపాయల ప్రోత్సాహక నిధులు అందజేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రామగుండం ఈ నిధిని దక్కించుకునేందుకు సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి కొత్తగా నిర్మించిన ఇంకుడు గుంతల వివరాలు సంబందిత పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , ఎ సి పి శ్రీహరి , టి పి ఎస్ నవీన్ , ఎ ఇ జమీల్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భద్రతకు ముప్పుగా శాంతి బిల్లు

**పార్లమెంట్‌లో మండిపడ్డ ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**చట్టం న్యూఢిల్లీ :** అణుశక్తి రంగంలో ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్పగించేలా తీసుకొచ్చిన 'శాంతి బిల్లు' దేశ భద్రత, ప్రజల భద్రతకు తీవ్రమైన ప్రమాదమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ లో తీవ్రంగా విమర్శించారు.బిల్లుపై చర్చ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ,...శాంతి బిల్లు అని పేరు పెట్టారు గానీ, ఇందులోని అంశాలు దేశానికి అశాంతిని తెస్తాయి. అణు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? సరఫరాదారులపై బాధ్యత తొలగిస్తే ప్రజల ప్రాణాలకు ఎవరు గ్యారంటీ ఇస్తారు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో ఉగ్రవాద దాడులు, నిరుద్యోగం, రూపాయి విలువ పతనం, ఇండిగో వంటి కార్పొరేట్ సంక్షోభాలపై ప్రభుత్వం జవాబుదారీతనం చూపడం లేదని విమర్శించారు. గత 11 ఏళ్లుగా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదని అన్నారు. ఫ్రాన్స్, రష్యా, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో అణుశక్తి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉందని గుర్తు చేస్తూ, భారత్‌లో ఈ కీలక రంగాన్ని ప్రైవేట్ చేతుల్లో పెట్టడం ప్రమాదకరమని స్పష్టం చేశారు.అణు ప్రమాదం ఉద్దేశాన్ని చూడదు. అది ప్రైవేట్ ప్లాంటా, ప్రభుత్వ ప్లాంటా అన్న తేడా లేకుండా తరాల భవిష్యత్తును నాశనం చేస్తుంది. బాధ్యత చట్టాన్ని బలహీనపరచడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అని ఆయన హెచ్చరించారు. అదానీ గ్రూప్ అణుశక్తి రంగంలో ఆసక్తి చూపిన వెంటనే ఈ బిల్లు రావడం యాదృచ్ఛికమా? అని ప్రశ్నించిన ఎంపీ, గత పదేళ్ల తప్పిదాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని సూచించారు.ప్రైవేటీకరణ అణుశక్తి రంగంలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైందని పేర్కొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఈ బిల్లును పునఃపరిశీలించి ప్రైవేట్ సంస్థలు, సరఫరాదారులపై కఠిన బాధ్యతలు విధించాలని డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ సర్పంచ్ కు ఘనంగా సన్మానించిన మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వర రావు



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మూడేగాం గ్రామ సర్పంచిగా బారాస బలపరిచిన అభ్యర్థి గౌడెల్లి గంగాధర్ గెలుపొందడంతో బిఆర్ఎస్ మండల నాయకులు బుధవారం శాలువతో ఘనంగా సన్మానించారు. మండలంలోని మూడేగాం గ్రామంలో పోరాడి గెలిచిన గంగాధర్ ఉమ్మడి సదాశివనగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగేల రాజేశ్వర రావు అభినందించారు. గ్రామ సమస్యలను అనునిత్యం ప్రజలతో మమేకమై పరిష్కార మార్గం కనుగొనాలని సూచించారు. ప్రజలు నీ పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం మీరు పోరాడితేనే అటుపార్టీకి ఇటుమీకు వ్యక్తిగతంగా ప్రజల్లో గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజలు కెసిఆర్ పాలన కోరుకుంటున్నారని ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మాజీ ఎంపీపీ అనసూయ రమేష్ సదాశినగర్ సింగల్ విండో చైర్మన్ కమలాకర్ రావు పద్మాజివాడి భాస్కర రావు బుచ్చిరెడ్డి వడ్డేపల్లి మల్లయ్య కిషన్ రావు బలవంతరావు అబ్దుల్లా తదితరులు పాల్గొనారు.

# పేస్–3 ఎన్నికల నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, సభలు నిషేధం: జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** పేస్-3 పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఈ క్రమంలో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ గ్రామంగా గుర్తించిన సయ్యద్ పల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె స్వయంగా సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది సమన్వయం, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పేస్-3 ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం గెలుపొందిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు లేదా ఇతర వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నంతకాలం ఈ ఆంక్షలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటాయని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా ప్రజలు, రాజకీయ నాయకులు మరియు అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



## ఉపాధి హామీ చట్టం పేరు మార్పు బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి : బికెయంయు




**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్చి దాని స్థానంలో వీబీ-జీరామ్ జీ పేరుతో వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ)గా కేంద్ర ప్రభుత్వం లోకసభలో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ మోడీ పాలనలో పేదల సంక్షేమానికి ఎలాంటి గణనీయమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికే అమల్లో ఉన్న ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ పేదల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం దుర్మార్గ చర్యగా పేర్కొన్నారు. ప్రస్తుతం 90 శాతం కేంద్ర నిధులు, 10 శాతం రాష్ట్ర నిధులతో నడుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని 60 శాతం కేంద్ర నిధులు, 40 శాతం రాష్ట్ర నిధులుగా మార్చితే రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే శ్రమజీవుల పోరాటాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల ఎల్లేశ్, జిల్లా అధ్యక్షుడు మునిగాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, కొట్టె పాక రవి, అలువాల రాజు, జూకంటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి – 83.56 శాతం పోలింగ్ నమోదు



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలలో భాగంగా వికారాబాద్ జిల్లాలో మూడవ విడత ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం జిల్లాలోని ఐదు మండలాల్లో నిర్వహించిన మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో 83.56 శాతం పోలింగ్ నమోదు అయిందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మూడవ విడత ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది, పోలింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం జరిగిందని స్పష్టం చేశారు. మొదటి, రెండవ మరియు మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఎవరూ విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని కలెక్టర్ హెచ్చరించారు. మూడు విడతల ఎన్నికలు పూర్తైనప్పటికీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోనే ఉంటుందని, ఎన్నికల కమిషన్ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యే వరకు కోడ్ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

## సింగరేణి ఏరియా హాస్పటల్‌లో వెల్ బేబి షో పోటీలు




**చట్టం రామగుండం :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా రామగుండంలోని సింగరేణి ఏరియా హాస్పటల్‌లో వెల్ బేబి షో పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఆర్జీ-1 పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులను తల్లిదండ్రులు అందంగా ముస్తాబు చేసి తీసుకురాగా, హాస్పటల్ ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వెల్ బేబి షో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషణపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే చిన్న వయస్సులోనే ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. డాక్టర్ ఎసియంవో అంబిక మాట్లాడుతూ ఈ వెల్ బేబి షో పోటీలలో ఒక సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల ఉద్యోగుల బాలబాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. ఎంపిక ప్రక్రియలో పిల్లల వయస్సుకు తగిన బరువు, ఎత్తు, ఆరోగ్య స్థితి, ఆకర్షణీయమైన వస్త్రధారణ, ముఖ వర్చస్సు, చిన్నారుల సహజమైన చలాకీతనం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో బేబి కింగ్, బేబి క్వీన్, ప్రిన్స్, ప్రిన్సెస్ విభాగాలుగా ఎంపిక నిర్వహించినట్లు తెలిపారు. వెల్ బేబి షోలో ఎంపికైన చిన్నారులకు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎసియంవో అంబికతో పాటు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మద్దిలేటి, డాక్టర్ పద్మ, సేవా సెక్రటరీ బీనా సింగ్, సేవా జాయింట్ సెక్రటరీ రజిత, లేడీస్ క్లబ్ సెక్రటరీ శిరీష, సంక్షేమ అధికారి శ్రీనివాస్, మ్యాట్రన్ నిర్మలతో పాటు హాస్పటల్ సిబ్బంది, తల్లిదండ్రులు మరియు అధిక సంఖ్యలో బాల బాలికలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో బుధవారం ఒక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. సేంద్రియ ఎరువుల లోడుతో వినాయకపురం నుంచి అశ్వారావుపేట వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్, లారీని తప్పించబోయి డ్రైవర్ స్టీరింగ్ ను ఒక్కసారిగా తిప్పటంతో ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ బోల్తా పడిన సమయంలో రోడ్డుపై మరెవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు, ప్రాణ నష్టం ఏమి జరగకపోవడంతో అక్కడ ఉన్న స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రజా సేవలో నిమగ్నమైన నూతన సర్పంచ్ : కోర్సా రాజేష్



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం స్థానిక గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా తిరుమలకుంట నూతన సర్పంచ్ కోర్సా రాజేష్ తన బాధ్యతను చాటుకుంటున్నారు. (ఐటిడిఏ) ద్వారా గ్రామంలోని కొండరెడ్లు తెగకు చెందిన వారికి పక్కా ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియలో భాగంగా బుధవారం అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. సర్పంచ్‌గా గెలుపొందిన వెంటనే తన తొలి ప్రాధాన్యతగా పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాజేష్ నడుం బిగించారు. రెడ్డిగుంపు గ్రామంలో గృహ మంజూరుకు ఎంతమంది అర్హులు ఉన్నారనే అంశాన్ని అధికారులతో కలిసి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సర్వేలో భాగంగా గ్రామంలోని మొత్తం 37 ఇళ్లను పరిశీలించగా అందులో 16 ఇళ్లు ఇప్పటికే పూర్తి కాగా, మిగిలిన 21 కుటుంబాలు నూతన ఇళ్ల కోసం అర్హులుగా ఉన్నట్లు గుర్తించారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి న్యాయం జరిగేలా పారదర్శకంగా ఈ సర్వేను పూర్తి చేయించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా సేవ కోసమే తనను ఎన్నుకున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా వెనుకబడిన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. గెలిచిన వెంటనే ప్రజల మధ్యకు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సర్పంచ్ రాజేష్‌ను గ్రామస్థులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ కోటేష్ గౌడ్




**చట్టం, శంషాబాద్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన పాలమాకుల సర్పంచ్ కోటేష్ గౌడ్, బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ప్రజల మౌలిక సదుపాయాల ఏర్పాట్లు ముందుండాలని మీకు తోడుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గూడెపు కుమార్, ఫక్రుద్దీన్ సురేష్, బాబు, విట్టల్, దశరథ్, సత్తయ్య, పాశం ఆంజనేయులు, తదితరు పాల్గొన్నారు.

## కౌఠ(బి ) సర్పంచ్ గా ఒరగంటి స్వామి



**చట్టం, బోథ్ :** బోథ్ మండల పరిధిలోని కౌఠ (బి ) గ్రామ పంచాయతీలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కౌఠ (బి) సర్పంచ్ గా ఒరగంటి స్వామి విజయం సాధించారు. కాగా మండలంలో మొత్తం 21గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. విజయం సాధించిన స్వామి వర్గీయులు సంబరాలు జరుపుకున్నారు.

## విధుల్లో నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ




**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మల్హార్ రావు మండలంలోని తాడిచెర్ల గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ, అక్కడి పోలింగ్ సరళి, బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలందరూ ఎలాంటి భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, ప్రతి ఓటు విలువైనదని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు కాపాడటం అత్యంత ముఖ్యమని, చిన్నపాటి సమస్య కూడా పెద్ద వివాదంగా మారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదే సమయంలో పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలితో జిల్లా ఎస్పీ ఆప్యాయంగా మాట్లాడి, ఆమెకు అవసరమైన సహాయాన్ని అందించాలని అక్కడున్న అధికారులకు సూచించారు. ఈ సందర్శనతో పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని స్థానికులు తెలిపారు.

# ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికలు

- జిల్లాలో బుధవారం జరిగిన మూడో విడత మండలాల్లో ప్రశాంతంగా పోలింగ్
- నాలుగు మండలాల్లో 86.45 శాతం పోలింగ్ నమోదు
- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్



**చట్టం/హనుమకొండ :** గ్రామపంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ హనుమకొండ జిల్లాలోని నాలుగు మండలాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. జిల్లాలో మూడో విడత ఎన్నికలలో భాగంగా ఆత్మకూరు, దామెర, నదికూడ, శాయంపేట మండలాల్లో ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరిగిందని పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో పోలింగ్ శాతం 86.45 నమోదైయ్యింది. ఆయా మండలాల పరిధిలో ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ కేంద్రాలలో సర్పంచ్, వార్డు స్థానాలకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను ఎన్నికల అధికారులు మొదలుపెట్టారు. వార్డులు, సర్పంచ్ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ఎన్నికల అధికారులు వెల్లడించారు.

**మండలాల వారీగా పోలైన ఓట్లు**

ఆత్మకూర్ మండలంలో 24844 ఓట్లు పోల్ కాగా 87.43 పోలింగ్ శాతం నమోదయ్యింది. దామెర మండలంలో 19602 ఓట్లు పోల్ కాగా 89.58 పోలింగ్ శాతం, నడికూడ మండలంలో 23362 ఓట్లు పోల్ కాగా 85 పోలింగ్ శాతం, శాయంపేట మండలంలో 28436 ఓట్లు పోల్ కాగా 84.74 పోలింగ్ శాతం నమోదయింది. ఈ నాలుగు మండలాల్లో మొత్తం 96244 ఓట్లు పోల్ కాగా 86.45 పోలింగ్ శాతం నమోదైయ్యింది.

**మూడు విడతలు ప్రశాంతం**

గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించగా జిల్లాలో మూడు దశలు ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11వ తేదీన, 14న రెండో విడత ఎన్నికలు జరిగాయి. గ్రామపంచాయతీలకు మూడో విడత ఎన్నికలు బుధవారం (17వ తేదీన ) జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రశాంతంగా ముగిశాయి. హనుమకొండ జిల్లాలో తొలి విడత లో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగగా, రెండో విడతలో ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో ఎన్నికలు జరిగాయి. మూడో విడతలో జిల్లాలోని ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాలకు సంబంధించిన గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు విడతల్లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి.


## శంషాబాద్ మున్సిపాలిటీ చార్మినార్‌లో విలీనం చేయొద్దు

- శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ప్రకటించాలి
- బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన కార్యక్రమం





**చట్టం, శంషాబాద్:** శంషాబాద్ మున్సిపాలిటీ చార్మినార్ లో విలీనం చెయ్యొద్దు అనే నినాదంతో చేపట్టిన ఈ ర్యాలీలో సుమారు 3000 మంది విద్యార్థులు,యువత,స్థానిక ప్రజలు పాల్గొన్నారు. శంషాబాద్ అభివృద్ధికి ఈ నిర్ణయం తీవ్రంగా నష్టం కలిగిస్తుందని స్థానిక నేతలు తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని దీనిని ప్రత్యేకంగా పరికనించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. అనంతరం బెంగళూరు జాతీయ అర్హదారిపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ప్రకటించాల్సిన స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు ఇవ్వకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు బుచ్చిరెడ్డి, కొనముల శ్రీనివాస్, మోహన్ రావు, రాచమల్ల రమేష్, పరమేశ్వరి, ప్రణయ్, చిన్న గండు రాజేందర్, రాచమల్ల జయసింహ, ఆనంద్, మద్దిలేటి, గుంటి చరణ్, పవిత్ర సాగర్, హనుమంతు, భాస్కర్, చందు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తడ్కల్ లో సర్పంచ్ గా సుగుణ మల్లారెడ్డి విజయం



**చట్టం నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ కంగ్టి మండలం తడ్కల్ సర్పంచ్ గా ఎలిశాల సుగుణ మల్లారెడ్డి విజయం సాధించారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి సమీప ప్రత్యర్థి కాపార్తి దీపపై 348 ఓట్ల తేడాతో గెలుపొందారు. దీంతో సర్పంచ్ అనుచరులు గ్రామంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. తమకు ఓటు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ బలపరిచిన 7 వార్డులు సభ్యులు గెలుపొందారని చెప్పారు. ప్రజా సేవ కోసమే తమకు ఎన్నుకుంటారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసిన ఉపసర్పంచ్ కొర్ర కళావతి శ్రీనివాస్ నాయక్




**చట్టం, శంషాబాద్ :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉప సర్పంచ్ గా ఎన్నికైన శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా ఉప సర్పంచ్ కోర్ర కళావతి శ్రీనివాస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్పంచ్ ఉప సర్పంచ్ ఆదర్శవంతంగా గ్రామాల్లో పాలన చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజల కోసం కష్టపడే మానవత్వాన్ని అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో అపజయం ఉండదని ఈ సందర్భంగా వారికి సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని భవిష్యత్తులో కూడా గ్రామపంచాయతీలకు సమృద్ధిగా నిధులు తెచ్చి పల్లెలను అభివృద్ధి పథకంలో నడపాలని తెలిపారు. గ్రామాలకి పరిమితమై ఎప్పటికప్పుడు అక్కడి సమస్యలు తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవనాయక్, కోర్ర స్వరూప,కాళీ, రమేష్, భాస్కర్, కోర్ర నీల, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారం ప్రజలకు కృతజ్ఞతలు


- సర్పంచ్ బాషిక ఎల్లస్వామి



**చట్టం /పరకాల:** నడికూడ మండలం ధర్మారం గ్రామ సర్పంచ్గా విజయం సాధించిన బాషిక ఎల్ల స్వామి గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరకాల ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాత రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచానని పేర్కొన్నారు. గ్రామంలోని కాంగ్రెస్ నాయకుల సహాయ సహకారాలు, ప్రజల ఆశీస్సుల వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ధర్మారం గ్రామ సేవకునిగా పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టు కుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ గా భాష బోయిన ఎల్ల స్వామి గెలుపొందిన సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కష్టసుఖాల్లో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

- ఒకే ఒక్క ఓటుతో ఓటమిపాలయ్యా అయినా ఆత్మస్థైర్యం తగ్గలేదు
- అధికారం ఉన్నా లేకున్నా ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటా
- నా మీద నమ్మకంతో ఐదు వార్డ్ ల్లో గెలిపించారు కృతజ్ఞతలు
- గెలిచిన వార్డు సభ్యులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని కలిసిన నీల దేవా నాయక్



**చట్టం, శంషాబాద్:** స్థానిక సంస్థ ఎన్నికల్లో శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొర్ర నీల దేవా నాయక్ బుధవారం గెలిచిన వార్డు సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... రాజకీయంలో గెలుపోటములు సహజం మీ తాండాకు నువ్వు చేసిన సేవలు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది కాబట్టి 8 వార్డులకు గాను ఐదు వార్డులు గెలుచుకొని నీ సత్తా చాటావు ప్రజలకు అందుబాటులో ఉంటూ నీ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించు అని అన్నారు. అదేవిధంగా ఈ సన్మాన కార్యక్రమంలో కొర్ర నీలా దేవా నాయక్ మాట్లాడుతూ ఐదు ఏళ్లుగా గ్రామానికి చేసిన సేవ గుర్తుంచుకొని నన్ను ఆదరించి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. మదనపల్లి కొత్త తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ ఎలక్షన్లో నాకు సపోర్టుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటుతో ఓటమిపాలయ్యా అయినా అధైర్య పడను ఉప సర్పంచ్ పదవి గెలుచుకున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ఎన్నికల్లో నేను గెలవకపోవచ్చు కానీ రాబోయే ఎలక్షన్లో తప్పకుండా గెలుస్తానని నమ్మకం నాకుంది నా ఓటు వేసిన ఓటర్లు ఎవరు కూడా అధైర్య పడవద్దు అధికారంలో ఉన్నా లేకపోయినా మీకు అండగా నేను ఎల్లప్పుడూ ఉంటా నాతో మీకు ఏ పని చేయించుకోవాలన్న మొహమాటం లేకుండా చేయించుకోవచ్చు ఆ స్వేచ్ఛ మీకు ఉంది అధికారం నాకు లేకపోయినా మీకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని మాట ఇస్తున్నాను అని అన్నారు. కష్టసుఖాల్లో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు ముదిరాజ్, మదనపల్లి కొత్త తండా ఉపసర్పంచ్ కొర్ర స్వరూప, ఖాళీ తదితరులు పాల్గొన్నారు.

## 75 ఆరోగ్య కేంద్రాలకు రూ.20 కోట్ల కేటాయింపు – ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హర్షం



**చట్టం, జీలుగుమిల్లి :** పోలవరం నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలలో ఉన్న 75 ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం మరియు ఆరోగ్యశాఖ ద్వారా సుమారు రూ.20 కోట్ల నిధులు మంజూరు కావడంపై పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జీలుగుమిల్లిలోని జీఆర్కే జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రధానంగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. తాజా నిధుల మంజూరుతో నియోజకవర్గంలోని ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, వైద్య సేవల నాణ్యత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో జరుగుతున్న అభివృద్ధిని తట్టుకోలేక కొందరు వైసీపీ నాయకులు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి కార్యక్రమాలే ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగా రవికుమార్, మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము, బుట్టాయిగూడెం మండల ప్రెసిడెంట్ బుచ్చిరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి మద్ద తేజ, చిర్రి శ్రీనివాస్, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, కోనా కుమార్, పద్దం వెంకటకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం




**చట్టం/ పరకాల ;** యూనియన్ బ్యాంకు బ్రాంచ్ గీసుగొండ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని సిరివెన్నెల గ్రామైక సంఘం, పేదరిక నిర్మూలన సంస్థ గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో రాంపూర్ గ్రామంలో నిర్వహించడం జరిగింది. వరంగల్ జిల్లా ఎఫ్ ఎల్ సి కౌన్సిలర్ భాస్కరాచారి మాట్లాడుతూ అందరూ ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన కలిగి ఉండాలి అన్నారు. బ్యాంకు ఖాతాదారులందరూ వారి వయసును బట్టి పీఎం ఎస్ బి వై మరియు పిఎం జె జె బి వై ఇన్సూరెన్స్ పథకాలను నమోదు చేసుకోవాలన్నారు. ఖాతాదారులందరూ ఆన్లైన్ డిజిటల్ సేవలను వినియోగించుకోవాలన్నారు సెర్ఫ్ సిసి బొజ్జ సురేశ్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అందరు జాగ్రత్తగా ఉండాలన్నారు టోల్ ఫ్రీ నెంబరు 1930 ని వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో వివోఏ రజిత, వివో ప్రతినిధులు స్రవంతి, రమ, రచన, సునీత, మరియు గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మిక పండుగ నేడు ఎల్లారెడ్డిలో మహా పడిపూజ



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణంలో గురువారం నేడు భక్తి, భక్తరంజని వాతావరణంలో శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి సామూహిక మండల మహా పడిపూజ మహోత్సవం ఘనంగా జరగనుంది. ఈ మేరకు అయ్యప్ప సేవా సమితి కమిటీ ఏర్పాట్లను బుధవారం పరిశీలిస్తూ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైందని తెలిపారు. నేడు ఉదయం 7 గంటలకు పుణ్యాహవచనంతో మహోత్సవానికి శ్రీకారం చుడతారు. అనంతరం మండపారాధన, గణపతి హోమం, ఉదయం 9 గం. నుండి 11 గం. వరకు ఆలయంలో నవవిధ అభిషేకాలు వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీశ్రీశ్రీ అఖిలాండకోటి నాయకుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాలు అర్చ్యాలు, పుష్పార్చన, భజన, మెట్ల పూజ, హారతి, హరిహరాసనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సాగనున్నాయి. భక్తులకు అల్పాహారం, తీర్థ-ప్రసాదాల వితరణ కూడా ఉంటుందనీ అయ్యప్ప సేవా సమితి కమిటీ తెలియజేశారు. ఈ పుణ్య కార్యక్రమంలో ఎల్లారెడ్డి పట్టణంతో పాటు సరిసమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామివారి ఆశీస్సులు పొంది మహా ప్రసాదాలను స్వీకరించాలని సేవా సమితి కమిటీ భక్తులకు ఆహ్వానం పలికింది.


## ఓటు హక్కును వినియోగించుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే



**చట్టం, జుక్కల్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం డోంగావ్ గ్రామంలో నిర్వహించిన పోలింగ్ సందర్భంగా జుక్కల్ మాజీ శాసన సభ్యులు హన్మంత్ షిండే తన స్వంత ఊరిలోని పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాదిగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి తప్పకుండా ఓటు వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తన జన్మభూమిలో ఓటు వేయడం ఎంతో గర్వకారణమని పేర్కొంటూ, ప్రజల ఆశీర్వాదంతోనే తాను రాజకీయ జీవితంలో ముందుకు సాగగలిగానని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచే దిశగా ప్రతి ఒక్కరి చైతన్యం అవసరమని, స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ప్రతి ఓటరుకు ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం నిలబడుతుందని పేర్కొంటూ, అధిక సంఖ్యలో ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని ఆయన ఆకాంక్షించారు.

## నార్లపూర్ ప్రజలకు కృతజ్ఞతలు

- సర్పంచ్ పెద్దబోయిన రవీందర్



**చట్టం /పరకాల:** నడికూడ మండలం నార్లపూర్ గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన పెద్దబోయిన రవీందర్ గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరకాల ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాత రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచానని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల సహాయ సహకారాలు, ప్రజల ఆశీస్సుల వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. నార్లపూర్ గ్రామ సేవకునిగా పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టు కుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ గా పెద్దబోయిన రవీందర్ గెలుపొందిన సందర్భంగా పలువురు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మొలంగూరు పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏడీ వినోద్ కుమార్



**చట్టం శంకరపట్నం :** శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూరు పశువైద్యశాలను బుధవారం కరీంనగర్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ. వినోద్ కుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రిజిస్టర్ల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలో భాగంగా ఆయన మాట్లాడుతూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. మందుల నిల్వలు, పశుగ్రాసం పంపిణీ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ఆఫీస్ సూపరింటెండెంట్ జగన్ మరియు స్థానిక పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాసేవలో ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్, ప్రజాసేవలో నిమగ్నమైన సందర్భం. వృద్ధురాలు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన సందర్భంగా ఆయన స్వయంగా వృద్ధురాలిని స్ట్రెచర్ పై పోలింగ్ కేంద్రంలోకి తీసుకుని వెళ్లి ఓటు హక్కును వినియోగించేలా చేశారు.

## షేర్ శంకర్ తండా ఏకగ్రీవ సర్పంచ్ గా బద్రి నాయక్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం షేర్ శంకర్ తండా గ్రామపంచాయతీ లో బద్రి నాయక్ ను ఏకగ్రీవ సర్పంచ్ గా ఎన్నుకోవడం జరిగింది తనపై నమ్మకంతో ఏకగ్రీవ సర్పంచ్ గా ఎన్నుకున్నందుకు గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం పాటుపడతానని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను తీరుస్తానని తెలియజేశారు.

## మేఘనాధ్ కు బిజెపి నాయకుల పరామర్శ




**చట్టం /పరకాల ;** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పరకాల మాజీ వైస్ చైర్మన్ దేవునూరి మేఘనాధ్ తండ్రి దేవునూరి చిన్న చంద్రయ్య ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డ్, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అమరేందర్ రెడ్డి, పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ రాష్ట్ర నాయకులు గుజ్జా సత్యనారాయణ రావు, మాజీ అధ్యక్షులు మార్త భిక్షపతి, దయ్యాల దేవరాజు, సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## పసరగొండ ప్రజలకు కృతజ్ఞతలు

**▶ సర్పంచ్ కొట్టే శ్రీవాణి రమేష్**



**చట్టం/పరకాల ;** దామెర మండలం పసరగొండ గ్రామ నూతన సర్పంచ్ గా విజయం సాధించిన కొట్టే శ్రీవాణి రమేష్ గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తన మీద నమ్మకముతో పసరగొండ సర్పంచిగా ఎన్నుకున్న గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి ధ్యేయంగా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ సేవకులుగా పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. సర్పంచ్ గా కొట్టే శ్రీవాణి రమేష్ గెలుపొందిన సందర్భంగా పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రాయపర్తి ప్రజలకు కృతజ్ఞతలు

**▶ సర్పంచ్ రాజా జగత్ ప్రకాశ్**



**చట్టం/పరకాల:** నడికూడ మండలం రాయపర్తి గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన రాజా జగత్ ప్రకాశ్ గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ సేవకునిగా పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ గా రాజా జగత్ ప్రకాశ్ గెలుపొందిన సందర్భంగా పలువురు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రామకృష్ణపూర్ ప్రజలకు కృతజ్ఞతలు



**▶ సర్పంచ్ పెండ్లి లక్ష్మి రాజు**

**చట్టం/పరకాల:** నడికూడ మండలం రామకృష్ణపూర్ గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన పెండ్లి లక్ష్మి రాజు గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ సేవకునిగా పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ గా పెండ్లి లక్ష్మి రాజు గెలుపొందిన సందర్భంగా పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్



**చట్టం ;**బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పు వెలువరించారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్‌లపై వచ్చిన ఫిరాయింపు ఆరోపణలను తోసిపుచ్చారు. ఫిరాయింపులపై ఎలాంటి ఆధారాలు లేవని తేల్చిచెప్పారు. వారిపై అనర్హత వేటుకు నిరాకరించారు. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై స్పీకర్ ఎలాంటి విచారణ జరుపకుండా నెలలపాటు సాగదీసిన సంగతి తెలిసిందే. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సాగదీతపై ఇప్పటికే సుప్రీం కోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. స్పీకర్‌పై పలు వ్యాఖ్యలు చేసింది. మూడు నెలల్లో తేల్చాలని, జూలై 31న సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 21తో గడువు ముగిసినా, తేల్చకపోవడంపై మండిపడింది. స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అంతేకాదు నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని గత నెల 17న తుది గడువు విధించింది. 'స్పీకర్ చర్యలు కోర్టు ధిక్కారమే. నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోండి. లేదా నూతన సంవత్సరం వేడుకలు ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో ఈ నెల 18వ తేదీ (గురువారం)లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోకుంటే స్పీకర్ కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉన్నది. కాబట్టి హడావుడిగా తీర్పు వెలువరించారని చర్చ జరుగుతున్నది.

## షాపులో దొరకని యూరియా యాప్‌లో దొరుకుతుందా : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**చట్టం ;**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధీమాను వ్యక్తం చేశారు. బుధవారం మహబూబ్ నగర్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహబూబ్ నగర్, హన్వాడ మండల బీఆర్ఎస్ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన రూ. 3,500 కోట్ల నిధుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసి, రిజర్వేషన్లను 24 శాతం నుంచి 17 శాతానికి తగ్గించి హడావుడిగా ఎన్నికలు జరిపిందని ఆరోపించారు. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో 70 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకే రావాలన్నారు. ఆ నిధులను ఆపే హక్కు ఎమ్మెల్యే, నాయకుడికిని లేదని చెప్పారు. సర్పంచ్ లకు సహాయం చేసేందుకు లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.రైతులు యూరియా కోసం చెప్పులను లైన్లలో పెట్టడం వల్ల ప్రభుత్వం పరువు పోతుందని ముఖ్యమంత్రి తెలివిగా 'యూరియా యాప్' తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. షాపులో దొరకని యూరియా యాప్‌లో దొరుకుతుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేళ్లే. మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. మీరు ఐదేళ్ల కోసం గెలిచారు, మిగిలిన సగం కాలం మన ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు చేసుకుంటారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు.రానున్న ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుందని ఆల వేంకటేశ్వర్ రెడ్డి అన్నారు. పార్టీకి పట్టుకొమ్మలైన నాయకులు, కార్యకర్తలకు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటదని వెల్లడించారు. పాలమూరు ప్రాజెక్ట్ కోసం కేసీఆర్ సమావేశం పెట్టి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, మహబూబ్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, పార్టీ హన్వాడ మండల అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, రహమాన్ సీనియర్ నాయకులు కొండ లక్ష్మయ్య, శ్రీనివాసులు, చెన్నయ్య, అల్లావుద్దీన్, అన్వార్ తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య ఎఫెక్ట్.. కొత్త సర్పంచ్‌ల అపాయింట్ డే వాయిదా

**చట్టం ;**రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌ల అపాయింట్‌మెంట్ డే వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20వ తేదీన కొత్త సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం జరగాల్సి ఉంది. కానీ ఆ రోజు అమావాస్య కావడం, పైగా సరైన ముహూర్తం లేకపోవడంతో ఆ డేట్‌ను ఈ నెల 22వ తేదీకి మార్చాలని పంచాయతీరాజ్ శాఖను ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన పంచాయతీరాజ్ శాఖ.. అపాయింట్ డేను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది.

# సిరిసిల్ల గడ్డ.. గులాబీ అడ్డా అని మరోసారి రుజువైంది : కేటీఆర్



**చట్టం సిరిసిల్ల:** సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అద్భుత విజయం సాధించిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల గడ్డ మరోసారి గులాబీ అడ్డా అని రుజువైందని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 117 గ్రామ పంచాయతీలకు గాను, బీఆర్ఎస్ మద్దతుదారులు ఏకంగా 80 స్థానాల్లో ఘనవిజయం సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారని తెలిపారు.సిరిసిల్ల నియోజకవర్గంలో మొత్తం ఐదు మండలాలలోని 117 గ్రామపంచాయతీలో ఎన్నికలు జరగ్గా 80 స్థానాలలో బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన పార్టీ నాయకులు విజయం సాధించారు. అధికార దుర్వినియోగం, బల ప్రయోగం వంటి పద్ధతుల్లో ప్రయత్నం చేసిన అధికార పార్టీ కాంగ్రెస్ కేవలం 24 స్థానాల్లో చాలా కష్టం మీద గెలిచింది. బీజేపీ మాత్రం కేవలం 13 గ్రామ పంచాయతీల్లో తమ పార్టీ మద్దతు దారులను గెలిపించుకోగలిగింది. సిరిసిల్ల నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ స్పందిస్తూ.. "గత రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీతో ఉన్న అనుబంధం ఎంత బలమైనదో ఈ ఫలితాలు మరోసారి తేల్చిచెప్పాయి. ఉద్యమ పార్టీగా ఉన్నా, అధికార పార్టీగా ఉన్నా, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండానే గుండెల్లో పెట్టుకున్నారు" అని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేటీఆర్ తెలియజేశారు. ఎన్నికల కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్.. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ విజయం సిరిసిల్ల ప్రజలు అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా, బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టి, కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం ఉంచి 80 స్థానాల్లో గెలిపించిన సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను" అని కేటీఆర్ అన్నారు.


**సిరిసిల్లలో కాంగ్రెస్ దయనీయ స్థితి**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సిరిసిల్లలో చతికిలపడింది. అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులు కేవలం 24 స్థానాలకే పరిమితమయ్యారు. దాదాపు 50కి పైగా గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయి మూడో స్థానానికి పడిపోయారు. ముఖ్యంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ (కేకే) సొంత మండలంలోనే ఆ పార్టీకి ప్రజలు చుక్కలు చూపించారు. వారి సొంత ఇలాకా అయిన ముస్తాబాద్ మండలంలో కాంగ్రెస్ గెలిచింది కేవలం 3 పంచాయతీలు మాత్రమే. దీన్ని బట్టి అక్కడ కాంగ్రెస్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**బీజేపీ, బండి సంజయ్ ప్రగల్భాలకు చెక్**

బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు వ్యాఖ్యలకు భిన్నంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. "సిరిసిల్లలో మెజారిటీ స్థానాలు గెలుస్తామని బండి సంజయ్ గారు ప్రగల్భాలు పలికారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు బీజేపీని పూర్తిగా తిరస్కరించారు. కేవలం 13 స్థానాలతో బీజేపీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాదాపు అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు నామమాత్రపు పోటీ ఇచ్చి ఓటమి పాలయ్యారు. బీజేపీకి సిరిసిల్లలో ఉనికి లేదని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి.

## శాయంపేట, దామెర మండలాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**చట్టం/హనుమకొండ :** శాయంపేట, దామెర మండల కేంద్రాల్లోని గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. శాయంపేట మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సరళి, ఓటింగ్ శాతం గురించి ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దామెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలను ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా మండలాల్లో రెండువేలకుపైగా ఓటర్లు ఉన్న పెద్ద గ్రామపంచాయతీలు ఉన్నచోట్ల నాలుగు టేబుల్స్ వేసి కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ కేంద్రాలలో ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియను అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కు సంబందించిన అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఓ మేన శ్రీను, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మండల ప్రత్యేకాధికారులు జయంతి, బాలరాజు, ఎంపీడీవోలు ఫణి చంద్ర, కల్పన, తహసిల్దార్లు ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


## సామాన్యులకు దడ పుట్టిస్తున్న గుండె జబ్బులు



అసలే చలి కాలం రాష్ట్రంలో చలి పంజా విసురుతుంది ఇటీవల కాలంలో ఏ నోట విన్నా గుండె పోటుతో మరణించి నట్లు నిత్యం పత్రికలలో వార్తలు వస్తున్నాయి. చిన్న తనం లోనే గుండె పోటుకి గురి అయి మరణించే వారి సంఖ్య అధికంగా వుంటుంది. పట్టుమని 20 యేళ్లు నిండనీ వారు కూడా మృత్యువు గుండె పోటు రూపం లో కబలిస్తో వుంది. నిత్యం వ్యాయామం, యోగ చేస్తూ, ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, మితా ఆహారం తీసుకుని, డిప్రెషన్ కి దూరంగా వున్న గుండె పోటు తప్పడం లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. రాబోయే రోజులలో మన దేశంలో గుండె పోటు మరణాలు అధికంగా ఉంటాయి అని సాక్షాత్తు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. హృదయ దినోత్సవంను ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తాయి. గుండెపోటు, గుండెజబ్బులను నివారించడానికి 1946లో జెనీవాలో వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటయ్యింది. 2000 సంవత్సరం నుండి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ నెల ఆఖరి ఆదివారం నిర్వహించబడిన ప్రపంచ హృదయ దినోత్సవం 2011 సంవత్సరం నుండి సెప్టెంబర్ 29వ తేదీన నిర్వహించబడుతుంది.గుండెజబ్బు అనేది నేడు సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద అనారోగ్య సమస్య. గతంలో కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చే గుండెజబ్బులు నేడు యుక్తవయస్కుల్లో కూడా రావడం ఆందోళనకర పరిణామం. అత్యంత ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నప్పటికీ ఎక్కువమంది మరణిస్తున్నది గుండె జబ్బుతోనే ప్రపంచ వ్యాప్తంగా సగటున సంవత్సరానికి ఒక కోటీ డెబ్బైఐదులక్షల మంది అంటే 39 శాతం మరణాలు సంభవిస్తున్నవి అని చెప్పవచ్చు. గుండె జబ్బులతోనే. ఈసంఖ్యను 2030 వరకు 25 శాతం తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ హృదయ సంస్థ కృషిచేస్తున్నది. గుండెవ్యాధికి అనారోగ్య సమస్యలు, వైద్యపరమైన కారణాల కన్నా సామాజిక, మానసిక సమస్యలు ప్రధాన కారణం. ఒత్తిడికి లోనవడం, మానసిక పరంగా డిప్రెషన్ కు లోను కావడం, చిన్న సమస్యలను పెద్దగా తీసుకోవడం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, శాఖాహారం తగ్గించి మాంసాహారం ఎక్కువగా తినడం, ఉప్పు, కారం, మసాలాలు,నూనెలు అధికంగా తినడం, బాల్యం నుండే జంక్ ఫుడ్ కు అలవాటు పడటం వంటి కారణాల వల్ల నేడు గుండె జబ్బులు అధికంగా రావడానికి కారణం అవుతున్నాయనీ డాక్టర్స్ అంటూ వున్నారు.తలిదండ్రులు పిల్లల ఆటలు, వినోదానికీ సరిగా సమయం కేటాయించలేక , మొబైళ్ళు, కంప్యూటర్ వంటి డిజిటల్ ఉపకరణాలతో కాలక్షేపం చేయిస్తున్నారు. ఇక స్కూళ్లలో ఆటస్థలాలే లేకుండా, ఆటల్లేకుండా బాల్యంనుండి యవ్వనంలోకి అడుగిడుతూ యుక్తవయసుకొచ్చే సరికి శరీరం, కండరాలకు తగినంత శక్తి లేకపోవడంతో 2025 ఏళ్లకే మధుమేహం, హైబీపీల బారిన పడుతున్నారు. వ్యాహ్యాళికీ, వాకింగ్‌కీ వసతుల్లేని పార్కులూ, ఆటస్థలం లేని స్కూళ్లు. ఆడించని పాఠశాలలు ఇవన్నీ అనారోగ్యానికి హేతువులు. నేటి బాలలు రేపటి భావి భారత పౌరులకు' బదులుగా 'నేటి బాలలే రేపటి రోగులుగా' తయారవుతున్నారు. దానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.బాల్యం నుండే విద్యార్థులకు ఆహారము, వ్యాయామము,విలువలతో కూడిన విద్య, ఒత్తిడిలేని విద్యపై అవగాహనను ఏర్పరచాలి. ఏ వయసు వారైనా వాకింగ్, యోగ, ప్రాణాయామము,ధ్యానము, వ్యాయామం చేయడం, మానసిక ఉల్లాసం కలిగించే సంగీతము, కళలు, పుస్తకాలు చదవడం వంటివి అలవర్చుకోవాలి. ఇవన్నీ సమస్యలో సమగ్ర భాగం. మన ఆరోగ్యానికి మంచి ఆహారమేమిటో మనందరికీ తెలుసు. సరదా, కాలక్షేపాలకోసం మనతొాపాటు పిల్లలకు సైతం జంక్‌ఫుడ్ తినిపిస్తున్నాం. కూల్‌డ్రింక్‌లతో జరిగే నష్టం తెలిసీ ప్రసార మాధ్యమాలమోజులో తాగిస్తున్నాం. బాల్యంలోనే వికృత రుచులకు అల్వాటు అనేకంటే బానిసలై ప్రకృతి రుచులను మరచిపోతున్నారు. వయసుతోపాటే రోగాల తాకిడీ పెరుగుతున్నది. మాంసాహారాన్ని త్యజిస్తే గొప్ప వ్యత్యాసం తెలుస్తుంది. మాంసాహారులకంటే శాఖాహారులు తక్కువ బరువుతో ఉంటారు. శాఖాహారుల్లొ గుండెవ్యాధుల ప్రమాదం 40% తక్కువగానుండటంవల్ల మరో ఏడేళ్ళపాటు ఆదనంగానూ, ఆరోగ్యంగానూ జీవిస్తారు. వ్యాయామ అవసరమెంతో తెలుసు. వ్యక్తులతోపాటు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం. యోగ, శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి ఈమధ్య కాలాల్లో 'యోగా'ను పెద్దఎత్తున ప్రోత్సాహించారు. ప్రభుత్వాలనుండి, సమాజంనుండీ విధానపరమైన ప్రోత్సాహం ఉంటున్నంది.ఉదయాన్నే లేచి సూర్యకిరణాలు చూస్తూ కొంత వ్యాయామం చెయడం శరీరానికి, మనసుకి కనీసావసరం. యోగధ్యానము ప్రాణాయామము వంటివాటిని మత విశ్వాసానికి సంబంధించిందని కొందరు భావించడం వారి సంకుచిత మనస్తత్వం తెలియజేస్తుంది. నిజానికి యోగా కాణీ ఖర్చులేని సంపూర్ణ ఆరోగ్య జీవన విధానం. వయసుతో నిమిత్తంలేకుండా శరీరం కండరాలు అనుమతించినంతరకు ఆసనాలు వేయవచ్చు. మద్యపానాలు త్యజించాలి ధూమ పానం, మధ్యపానాలు వల్ల కూడా చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు వీటితో సంక్రమించే కేన్సర్, మధుమేహం, పక్షవాతం గుండెజబ్బుకు ఆదనపు మద్దతునిస్తాయి. ఈఅలవాట్లను విసర్జించడానికి కావలసింది మానసిక స్థైర్యం. సాంప్రదాయిక అలవాట్లు, ఆహారవిధానాలకు దూరమై తిరోగమన పద్ధతులకు చేరువయ్యాం.

**కామిడి సతీష్ రెడ్డీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు 9848445134**

## డిసెంబర్‌లోనే 'ప్రైవేట్ ఇంటర్ అడ్మిషన్లు



**చట్టం హైదరాబాద్:** రాష్ట్రంలో కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీలు అడ్డదారులు తొక్కుతున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల దందాకు తెరలేపాయి. పదోతరగతి వార్షిక పరీక్షలకు ముందే అడ్వాన్స్‌గా ఇంటర్ అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. ఇందుకోసం విద్యాసంస్థలు పీఆర్‌వోలు, మార్కెటింగ్ సిబ్బందిని రంగంలోకి దింపాయి. తల్లిదండ్రులకు మాయమాటలు చెప్తూ ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు అడ్మిషన్ పొందితే ఒక ఫీజు.. ఆలస్యమైతే మరో ఫీజు అంటూ స్పెషల్ ఆఫర్స్ ప్రకటిస్తున్నాయి. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పటికే ఫీజులు కూడా చెల్లించినట్టు తెలిసింది. కాలేజీల ప్రతినిధులు అడ్మిషన్ల కోసం పోటీపడుతుండటంతో తల్లిదండ్రులకు నాలుగైదు కాలేజీల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. రోజుకో కాలేజీ ప్రతినిధులు వచ్చి బుర్ర తింటున్నట్టు తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇంత జరుగుతుంటే ఇంటర్‌బోర్డు అధికారులు ఏం చేస్తున్నారని తల్లిదండ్రులు, విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.ముందస్తు ప్రవేశాలు..నిబంధనలకు విరుద్ధం ఇటీవలే పదోతరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. పరీక్షలు మార్చిలో మొదలై ఏప్రిల్‌లో ముగుస్తాయి. ఇంటర్ అడ్మిషన్ల కోసం ఇంటర్‌బోర్డు కాలేజీలకు అనుమతి జారీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అడ్మిషన్స్ నోటిఫికేషన్ జారీ చేసి, విద్యార్థులను చేర్చుకోవాలి. కానీ అఫిలియేషన్లు, అడ్మిషన్ నోటిఫికేషన్‌కు ముందే కాలేజీలు సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి. ముందస్తు అడ్మిషన్లు నిబంధనలకు విరుద్ధం. కానీ ఇంటర్‌బోర్డు అధికారులు, డీఐఈవోలు, నోడల్ అధికారులు చోద్యం చూస్తున్నారని, పరోక్షంగా ప్రైవేట్ దందాకు సహకరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త!**

ఇంటర్ అడ్మిషన్ల విషయంలో తల్లిదండ్రులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు. గతంలో జరిగిన పలు ఉదంతాలను ఉదహరిస్తున్నారు. విద్యార్థులు కాలేజీలు, వసతి గృహాల వాతావరణానికి అలవాటు పడుతారో లేదో.. అడ్మిషన్ క్యాన్సిల్ చేసుకోవాల్సి వస్తే కట్టిన ఫీజు పరిస్థితి ఏంటి... వంటి విషయాలను ఆలోచించాలని చెప్తున్నారు. గతంలో అడ్మిషన్స్ రద్దు చేసుకోవాలని భావించిన తల్లిదండ్రుల పట్ల ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఎంత దురుసుగా ప్రవర్తించాయో వివరిస్తున్నారు. కాలేజీలో చేరిన కొన్ని రోజులు, వారాల తర్వాత అడ్మిషన్ రద్దు చేసుకున్నా సగం ఫీజు కూడా వెనక్కి ఇచ్చే పరిస్థితి ఉండదని అనుభవాలు చెప్తూ హెచ్చరిస్తున్నారు.

## కేసీఆర్ సీఎం కావాలని పల్లె ప్రజలు తీర్పునిచ్చారు.. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై హరీశ్‌రావు



**చట్టం హైదరాబాద్;** కేసీఆర్ సీఎం కావాలని.. బీఆర్ఎస్ మళ్లీ రావాలని పల్లె ప్రజలు తీర్పునిచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాని తెలిపారు. సిద్దిపేట జిల్లా నాంచారుపల్లి బీజేపీ సర్పంచ్ నరసింహారెడ్డి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దకోడూరుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కపట నాటకాలకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు.. అది సబ్‌కా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. పేదల పథకాలకు ఎసరుపెట్టే కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. మహిళలకు రూ.55 వేలు, వృద్ధులకు రూ.44 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని అన్నారు.

## సివిల్ కాంట్రాక్టర్ నుంచి రూ.11వేల లంచం.. రెడ్ హ్యాండ్‌గా దొరికిన బిల్డింగ్ డివిజన్ డీఈ



**చట్టం ;**అవినీతి నిరోధక శాఖ దాడుల్లో బిల్డింగ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ రెడ్ హ్యాండ్‌గా దొరికిపోయాడు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలంలో బుధవారం సివిల్ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ డీఈ శ్రీనివాస్ పట్టుబడ్డాడు. శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్ రూ. 11,000 లంచం డిమాండ్ చేశాడని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఓయూ మానేరు హాస్టల్‌లో సివిల్ వర్క్స్ ట్రాక్టర్ రూ.14 లక్షల బిల్ పాస్ చేయడం కోసం బిల్డింగ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ రూ. 11 వేలు లంచం అడిగాడు. వారం రోజుల కింద ఫోన్ పే ద్వారా రూ. 5,000 పంపాడు కాంట్రాక్టర్. మిగిలిన రూ. 6 వేల ఇవ్వాలని శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్‌ను వేధించాడు. దాంతో.. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం అని డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

## జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్‌పై అభ్యంతరాల గడువు పెంచుతూ హైకోర్టు ఆదేశాలు

**చట్టం ;** జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్ మ్యాప్, జనాభా వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని హైకోర్టు ఆదేశించింది. 24 గంటల్లోగా ఆ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత రెండు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించాలని సూచించింది.జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్‌పై అభ్యంతరాల గడువు పెంచుతూ హైకోర్టు ఆదేశాలు జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్ మ్యాప్, జనాభా వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని హైకోర్టు ఆదేశించింది. 24 గంటల్లోగా ఆ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత రెండు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించాలని సూచించింది.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com